RNI APTEL / 2006 / 17980
POSTAL REGD.NO. VSP - 142 / 2015-2017

# క్రైస్తవనాడు

₹ : 5

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

www.facebook.com / christavanaadu

www.christavanaadu.weebly.com

CHRISTAVANAADU
TELUGU FORTNIGHTLY
REGD. NEWS PAPER

POST BOX NO. : 2, OLD DAIRY FARM POST,
ADARSHNAGAR, VISAKHAPATNAM - 530 040.
A .P, INDIA. Call : 9346960601, 9490866640.
christavanaadu@gmail.com & christavanaadu1@yahoo.co.in

సంపుటి : 10 సంచిక : 3
ఎడిటర్ : వై.కనకరాజు
2015 సెప్టెంబర్ 16-30
పేజీలు : 8

PUBLISHED FROM
VISAKHAPATNAM

రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము. ★
వచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును. ★
ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నది గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు. ★

మర్మగర్భ వివరణలు.. అనేక ప్రశ్నలకు.. సందేహాలకు సమాధానాలు ఒకే చోట

'క్రైస్తవనాడు'

## సంచలనం!

ఆర్టికల్స్‌లో..!

చదవండి! అనేకులతో పంచుకోండి!!
పేపరుమరింత విస్తరించేట్లు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తు చేసుకోవాలని కోరుతున్నాం.
- ఎడిటర్




**ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది. ★**

ఆస్తికులు (దేవుడున్నాడని నమ్మువారు) కానీండి, క్రైస్తవులు కానీండి 'దేవుని నమ్మినవారు' పూజింపవలసింది కేవలం దేవున్ని, ఆయన నామాన్ని మాత్రమే. లోకంలో అనేకులు దేవున్ని పూజించుటకు బదులు మనుష్యులలో ఘనులైన వారిని పూజించుట చూస్తున్నాము. అలా పూజింపబడువారు పూజార్హులా అని ఆలోచిస్తే వారెప్పటికిని పూజార్హులు కానేరరు. దేవునితో ఎవరు సమానులు కారు. చరాచర సృష్టిని చేసి తన మహిమాబలాతిశయజ్ఞానంతో పరిభ్రమింపచేసి, విశ్వంలో గల ఎటువంటి పదార్థం వలన నశింపకుండునట్లు కాచి, కాపాడుతున్న దేవునితో ఎవరు సమానులు కాగలరు? ఆలోచించండి! మనం ఎవరిని ఆయనతో సమానునిగా చేయగలం? దేవుని శక్తి నెరిగిన వారెవరూ అలా చేయుటకు సాహసించలేరు. మానవులలో ప్రసిద్ధి చెందినవారు గౌరవింప దగినవారు. వారు బ్రతుకుకాలంలో చూపిన మంచి నడత వారిని సన్మానానికి పాత్రులనుగా చేస్తుంది. వారిని తోటివారిచే సన్మానింపదగిన వారిగా మారుస్తుంది. ఇందులో ఎటువంటి సందేహమక్కరలేదు.

2

వాస్తును నమ్మడం వెనుకబాటుతనం

- టివి 9



దేవుడు వాక్యాన్నిచ్చాడు. మనము హృదయాన్నిచ్చాము. రెండూ కలసి పని చేయాలి. అప్పుడే జయం కలుగుతుంది.

-సామ్యూల్ ఆర్.పట్టా, హైద్రాబాద్



దేవుని మన కోసం ఏమీ కోరుకోనక్కర్లేదు. ఒకవేళ కోరుకోవాల్సివస్తే ఎదుటివారి కొరకు కోరుకోవాలి.

-ప్రకాష్‌రాజ్,
సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రంలో

ప్రార్థించండి! పాల్గొనండి!! దైవ దీవెనలు పొందండి!!!

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)
1-9-52/ఇ/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020.



యు.పి.ఎఫ్.
ఆదివారపు సాయంకాల ఆరాధన
ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా అడిక్‌మెట్, హైదరాబాద్‌లో జరుగును.

జాయ్ చెరియన్
యు.పి.ఎఫ్.ఫౌండర్ & ప్రెసిడెంట్

సమయము :
సా॥ 5గం॥ల నుండి
8.30 ని॥ల వరకు

అందరికీ ఆహ్వానము

వివరములకు :
ఫోన్. 040-27624030

అన్ని వాహనములకు పార్కింగ్ సౌకర్యము కలదు. బస్ & రైలు (ఎమ్.ఎమ్.టి.ఎస్) సౌకర్యము కలదు.

బస్ నెం. 86,86కె, 86జె కోఠి మరియు సికింద్రాబాద్ నుండి కలవు.

## ఆంధ్రప్రదేశ్ NORTH EAST WEST SOUTH తెలంగాణ

# రైతు మరణాలు ఆగాలి

తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్యకాలంలో ఎక్కువగా వింటున్న విషాద వార్త.. రైతు మరణాలు. ఆర్థిక ఇబ్బందులు, పంటలు పండక, పండినా గిట్టుబాటుకాక, దళారుల దోపిడీ తదితర అనేక రకాలుగా క్షోభననుభవిస్తూ తుదకు మరణమే ముగింపు అని భావిస్తున్నారు. ఇది అత్యంత బాధాకరం. ప్రభుత్వాలు ఆ యా రైతులందరి కుటుంబాలను ఆదుకోవాలి. వారికి మనోధైర్యం కలిగించాలి. ఇది అందరి బాధ్యతగా గుర్తించాలి. ఇకపై రైతుల మరణాలు ఆగాలి అని ప్రార్థిస్తూ తమవంతు సహకారం తామందిస్తామంటున్న క్రైస్తవనాయకులు, సేవకులు, విశ్వాసుల మాటలు చేతల్లోకి రావాలి. అందరి క్షేమంకోసం ప్రభుత్వాల కోసం మనందరం ప్రార్థించాలి. ప్రార్థిస్తే ప్రార్థన వినే దేవున్నే మనం కలిగున్నామని, ఆయన తప్పక అందర్నీ ఆదరించే 'ఆదరణ కర్త'ని తెలుపుతూ గుర్తుచేస్తూ అనేకమంది క్రైస్తవ నాయకులు, సేవకులు, విశ్వాసులు ఈ సందర్భంలో మిగతా క్రైస్తవులను ప్రార్థించమనీ కోరుతున్నారని తెలుస్తోంది. దేవుడు మనందరి ప్రార్థనలకు జవాబుగా రాష్ట్రాలను సుభిక్షపరచుగాక అంటూ దీవిస్తున్నారెందరో.

## 'క్రైస్తవనాడు' (ఏ.పి.) ప్రధాన కార్యాలయం అడ్రస్సు మారింది. పాఠకులు గమనించగలరు!

తండ్రియైన దేవుని ప్రేమ, మన ప్రభువైన యేసుక్రీస్తు కృప, పరిశుద్ధాత్ముని అన్యోన్య సహవాసంతో 'క్రైస్తవనాడు' ప్రారంభించబడినప్పటినుండి 10వ, సంవత్సరంలో ప్రవేశించిన ఇప్పటివరకు మనుష్యుల దయను కూడా పొందుతూనే ఉంది. ఇకపై కూడా అట్టి విధంగానే 'క్రైస్తవనాడు' మున్ముందుకు సాగేందుకు పాఠకులైన మీ ప్రార్థనా సహకారాలూ ఎంతో అవసరం. 'క్రైస్తవనాడు' ప్రారంభించబడిన క్రీ.శ. 2006వ, సంవత్సరం నుంచి ఇప్పటివరకు అద్దెకున్న 6 అడ్రస్సులనుంచి మీకు అందించబడింది. ఇప్పటినుంచి ఈ క్రింది ఇవ్వబడిన 7వ, అడ్రస్సునుంచి ఇకపై మీకందించబడుతుంది. ఇదికూడా అద్దెకున్నదే. పాఠకులు గమనించి ఎప్పటివలె సహకరించగలరని మరోసారి కోరుతున్నాం. అడ్రస్సు : 13-410/1/2, అంబేద్కర్ నగర్, ఆరిలోవ, విశాఖపట్నం - 530 040.

'క్రైస్తవనాడు' ప్రధాన కార్యాలయానికి పర్మనెంట్ అడ్రస్సు కొరకు పాఠకులు ప్రార్థించాలని కోరుతున్నాం. ప్రభువు చిత్తమైతే మనందరి ప్రార్థనా సహకారాలను బట్టి 'క్రైస్తవనాడు' పేపరుకు పర్మనెంట్ అడ్రస్సు అతి త్వరలోనే లభిస్తుందని ఆశిస్తున్నాం. ఆశపడే ప్రాణాన్ని తృప్తిపరచే దేవున్నే మనం కలిగున్నాం. అందుకు దేవునికి స్తోత్రం. - ఎడిటర్

మెదక్ జిల్లా సదాశివపేట లో అతి పెద్ద ఫ్యామిలీ వస్త్ర ప్రపంచం!




పండుగ సీజన్‌లలో
డిస్కౌంట్ ధరలతో ...!
పిల్లలు, యూత్, పెద్దలకు అవసరమయ్యే
అన్ని రకముల వస్త్రాలు
లభించే ఒకే చోటు!

బస్టాండ్ వెనుక సదాశివపేట, మెదక్ జిల్లా,
తెలంగాణ రాష్ట్రం.




యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును. 1 యోహాను 1 : 7

బేతెస్థ మినిస్ట్రీస్ నిర్వహించు...

విమోచన పండుగలు
రక్షణ సభలు

12 నుండి 16
అక్టోబర్ 2015
(సోమవారం సా॥ నుండి శుక్రవారం మ॥ వరకు)
ఉ॥ 9.30 మ॥ 2.30 సా॥ 6-30

స్థలం షాదీఖానా కళ్యాణ మండపం, NH-5 రోడ్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16

ప్రసంగికులు:
అభిషేకించబడిన దైవజనులు

మధురమైన ఆత్మీయ సంగీతము
మరియు స్తుతి-ఆరాధన కలవు

అద్భుతమైన రక్షణ సాక్ష్యములు వినిపించబడును
రోగుల కొరకు స్వస్థత ప్రార్థనలు చేయబడును
రిజిస్ట్రేషన్ ఫీజ్: రూ. 20/- (ఒక వ్యక్తికి)
(దూర ప్రాంతముల నుండి వచ్చువారికి భోజన వసతి కలదు)

అందరూ ఆహ్వానితులే



ప్రేమతో ఆహ్వానించువారు
బ్రదర్ పరమానందం
బేతెస్థ మినిస్ట్రీస్, సంజీవయ్యకోలని-1, విశాఖపట్నం-4

వివరములకు: 9000812429, 9849327250, 9949938906

2 క్రైస్తవనాడు ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక 16-30 సెప్టెంబర్ 2015




(మొదటి పేజీ తరువాయి)

మనలో అనేకులు వారు చూపిన, చేసిన వాటివైపు ఆకర్షించబడి, వారిని అనుకరించే వారిగా ఉండుటకు ఇష్టపడ్డారు. అలా మానవులందరూ మంచి మార్గాన నడవాలన్నదే దేవుని సంకల్పం. అందుకే దేవుడు అలాంటి వారిని భూమిపై గొప్పగా జీవింపజేస్తారు. వారికి ఘనత కలుగజేస్తారు. అలాంటి ఘనత పొందిన వారిలో ప్రభువైన యేసుక్రీస్తు అగ్రగణ్యులుగా మనకు కనబడతారు. ప్రపంచంలో కాలాన్ని లెక్కించుటకు ఆయన 'శకాన్ని' వాడుట మనకు తెలుసు. చరిత్ర, కాలాన్ని లెక్కించుటకు ఆయనే మధ్యవర్తి. ఆయనకు ముందు సం॥లను 'క్రీస్తు పూర్వమని', ఆయన జన్మించిన తరువాత సం॥లను 'క్రీస్తు శకమని' లెక్కించుట జగద్విదితం. ఆయన శకపురుషుడు, అద్వితీయుడు (ద్వితీయుడు లేనటువంటివారు) ఒకే ఒక్కరు. అటువంటి స్థానం ఇప్పుడు మరెవరికి ఇచ్చుటకు వీలుకాదు. ఇచ్చుటకు ప్రపంచ మేధావులు ఆలోచన చేసినా అది కుదిరే పనికాదు. యేసుక్రీస్తుకు అంతటి ఘనత కలుగుటకు కారణం మనందరి తండ్రియైన పరలోకపు దేవుడు. మనుష్యులు ఆయనను 'శకపురుషునిగా' ఎలక్షన్ ద్వారా ఎన్నుకోలేదు. శకపురుషునిగా ఎన్నుకొనుటకు కొందరి ఘనులమధ్య పోటీ నిర్ణయిస్తే అది ప్రపంచయుద్ధానికే దారితీస్తుందేమో? ఎందుకంటే ప్రపంచంలో అనేక మతాలు.. జాతులు, ఒకరంటే ఒకరికి పడదు. అందువల్ల ఒకరిపై ఒకరికి ద్వేషంపెరిగి, 'శకపురుషుడుగా', ఒకరు మావాడంటే ఇంకొకరు మావాడే కావాలని యుద్ధాలు చేయుటకు వెనుకాడని రోజులివి.

యేసుక్రీస్తు భూమిపై సామాన్యునిగా పుట్టి, అసామాన్యునిగా జీవించినట్లు చరిత్ర సాక్ష్యమిస్తుంది. దేవుడు ఆయనపై అపారప్రేమను కనపర్చినట్లు ఆస్తికులు బైబిలునందు గల ఆయనచరిత్రను చదివితే సులువుగా గ్రహింపగలరు. దేవుని జ్ఞాన గ్రంథమైన బైబిలునందు ఆయన గూర్చి దేవుని కుమారునిగా వ్రాయబడింది. అది లోకంలో అనేకుల (క్రైస్తవుల)చే నమ్మబడింది. పరిశీలించి బైబిలు చదివి గ్రహించిన వారెవరైనా ఆయనను దేవుని కుమారునిగా అంగీకరించుటకు ఇష్టపడుదురు. ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి బైబిలునందు వ్రాయబడిన కొన్ని వచనాలు చూసి గ్రహిస్తే ఆయన 'పూజార్హుడు'అని సులువుగానే గ్రహించొచ్చు.

**నా యిష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపినవాని(తండ్రియైన దేవుని) చిత్తము నెరవేర్చుటకే పరలోకమునుండి దిగివచ్చితిని. ★**

పై మాట యేసుక్రీస్తు భూమిపై జీవించుకాలంలో పలికినది. పలికిన మాట నెరవేర్చుకొనుటకు ఆయన చూపిన సహనం, ప్రేమ, దయ మరువరానిది. దైవత్వాన్ని మానవత్వంలో చూపిన ఘనుడాయన. దేవుని గుణగణాలను మానవ శరీరంలో నెరవేర్చి చూపుట బహుకష్టం. దేవుడు అన్నిచోట్ల ఏకకాలంలో ఉండ సమర్థుడు. అందువల్లే ఆధ్యాత్మికులు దేవుని సర్వాంతర్యామి అంటారు. మనిషి ఒక్కచోటనే ఉండగలడు. అటువంటి శరీరాన్ని ధరించిన యేసుక్రీస్తు దేవుని ఉన్నతత్వాన్ని ఆ శరీరంలో తన బ్రతుకులో చూపించారు. ఇది అమోఘమైన సంగతి. ఆ విధాన అప్పటి ప్రజలను ఆశ్చర్య చకితులను చేసారు. అది ఇప్పటివారికీ ఆశ్చర్యమే! ఇది ఎవరూ కాదనలేని ఆధ్యాత్మిక, సామాజిక సత్యం. భూమిపై జీవించునపుడు ఆయన దేవుని యందు ఎంత భయభక్తులు కలిగియున్నారో తెలుసు కొనుటకు ఆయన మరణాన్ని జయించిలేచిన తరువాత వ్రాయబడిన మరొక లేఖనంచూస్తే...

**శరీరధారియై యున్న దినములలో మహా రోదనముతోను, కన్నీళ్లతోను తన్ను మరణము నుండి రక్షింపగలవానికి(దేవునికి) ప్రార్థన లను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన(యేసుక్రీస్తు) అంగీకరిం పబడెను.★**

పై వాక్యాన్ని చదివారు, ఆలోచించండి! మనుష్యులు దేవుని యందు భయభక్తులు కలిగి ఉంటున్నారా? మనకై మనం అలాంటి సాక్ష్యం కలిగి జీవించగలుగుతున్నామా? ఇంతవరకు లోకంలో ఘనులెవరైనా అలాంటి జీవిత సాక్ష్యం కలిగి ఉన్నారా అని వెతికితే చరిత్రలో ఎవరూ లేరన్నది సత్యదూరం కాదు. చరిత్రలో ఘనులైన అందరూ రక్తసిక్త జీవితాలతో సంబంధాలు కలిగినవారే. యేసులాంటి జీవన విధానం కొంతవరకు కలిగిన వ్యక్తిగా మన దేశానికి చెందిన గాంధీజీ అని చెప్పొచ్చు. మన దేశానికి దేవుడిచ్చిన బహుమానమే గాంధీ జీవితం. ప్రభువైన యేసుక్రీస్తుకు సాదృశ్యం. అయినాసరే గాంధీజీ జీవనవిధానాన్ని యేసుక్రీస్తు జీవనవిధానంతో సరిపోల్చలేం. గాంధీజీయే కాదుగాని అలా ఎవరూ జీవించలేరన్నది అతిశయోక్తికాదు. యేసు పలికిన ఓ మాట గాంధీజీ పలికిన మాటగా మనదేశంలో బహుళ ప్రాచుర్యం పొందింది. అదేదనగా 'ఎవరైనా నీ కుడి చెంపపై కొడితే ఎడమ చెంప చూపమన్నది'. ఇది గాంధీ చెప్పినట్లు మనదేశంలో అనేకులు భావిస్తారు. నిజానికి ఆ మాట ప్రభువైన యేసుక్రీస్తు పలికినదని మరోసారి గుర్తుచేస్తున్నా! అటువంటి అనేక మాటలు అనగా దేవుని ప్రేమతత్వాన్ని తెలిపేవి తన బ్రతుకుకాలంలో చూపి లోకానికి యేసుక్రీస్తు మార్గదర్శకులైనారు. శరీర కోరికలను బట్టి జీవించు వారు దైవతత్వమైన ఆత్మతత్వాన్ని అర్థంచేసు కొనుట బహుకష్టం. గ్రహించు వారందరూ ఆచరిస్తే ఈ లోకమే పరలోకం అయ్యేది. అలా బ్రతుకుటకు అనేకులు ఇష్టపడక తమ శరీరాశలు, నేత్రాశలు, జీవపు డంబాలు, నెరవేర్చు కొనుటచే ఈ లోకం అశాంతికి గురౌ తుందనుటకు సందేహ పడనక్కరలేదు.

**ఆత్మానుసారముగా నడుచుకొనుడి. అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. ★**

ఆత్మయే జీవింప జేస్తుందని, ఆత్మలేకపోతే శరీరం మృతమని, అదే మరణమని ఆస్తికుల నమ్మకం. ఆత్మానుసారముగా జీవించువారు ఎలా ఉండాలో తెలియజేస్తూ వ్రాయబడిన వాక్యం పరిశుద్ధ గ్రంథం నుండి.... మనం ఆత్మను అనుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందుము. ఒకరినొకరము వివాదము రేపకను, ఒకరి యందొకరము అసూయ పడకను వృధాగా అతిశయ పడకను ఉందము.

పై మాటలలో గల సత్యం గ్రహించి ఆచరిస్తే మానవులు అందరూ మహనీయులే అయ్యేవారు. యేసుక్రీస్తు తన బ్రతుకుకాలంలో పై వాక్య భావాన్ని సంపూర్ణంగా తన శరీరమందు నెరవేర్చినట్లు బైబిలు చదివి గ్రహించువారికి సులువుగా తెలుస్తుంది. అందు కారణంచే ఆయన 'పూజార్హుడు'. ఆయనతో ఎవరు సమానులు కాగలరు? ఎవరిని మనం సమానులనుగా చేయగలం? ఆలోచించండి! అన్ని నామాలకంటే పైనామం ఆయనకియ్యబడిందని బైబిల్లో మనమనేకసార్లు చదువుతాం.. వింటుంటాము.. ఒప్పుకుంటాము. మరి అలా ఒప్పుకున్న క్రైస్తవులే మనలో అనేకులను ఆయనతో సమానం చేయుట చూడగలుగుతున్నాం. వారినే పూజిస్తూ (అనేకసార్లు తలవడము, వారు మాత్రమే వీరి అవసరాలు తీర్చగలరని వారిని ఘనపరచడం, వారిని గూర్చే రోజులో ఎక్కువసార్లు పలుకడము ఇటువంటివెన్నో పూజించుట క్రిందకు వస్తాయి) ప్రభువైన యేసుక్రీస్తుతో సమానులనుగా వారికి తెలియకుండానే చేస్తున్నారు. అవునో కాదో మీరే చెప్పండి!

క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువవేసి యున్నారు.

పై వాక్యం నెరవేర్చుటకు ఇష్టపడుచు ఆమాట వ్రాసిన అపొస్తలుడైన పౌలువలే తమ శరీరాలను నలగగొట్టుకుంటూ జీవిస్తే చాలు. మనల్ని బట్టి ఆయన నామం ఘనపరచబడుతుంది. అలాంటివారు ఆయనను ప్రకటిస్తూ (క్రీస్తుని నమ్మని వారికి, క్రైస్తవులకుకాదు). బయలు వెళ్ళితే ప్రపంచమంతా ఆయన నామం పూజింపబడుతుంది. 'పూజార్హుడు' ఆయన మాత్రమే అని తలంచువారు ఆయనను ప్రకటింపబద్ధులై యున్నారు. ఆయన క్రైస్తవులమైన మనకు చెయ్యమన్న 'పని' ఇదొక్కటే. ఆ పనిని మన బ్రతుకుకాలంలో సక్రమంగానెరవేర్చి ప్రభువిచ్చు 'జీతం' పొందిన వారిగా ఉండాలి. మన తరువాతి తరాలలో గుర్తింపబడుటకు ఇష్టపడాలి. మన హృదయాలలో పూర్తిగా నిండి ఉండవలసిన వారు యేసుక్రీస్తు మాత్రమే. వేరెవ్వరూ కారాదు. ఆయన చేసిన కార్యం మరెవ్వరూ చేయలేనిది. ఆయన మన పాపములకు మాత్రమే కాదు సర్వలోకమునకు శాంతికరమై యున్నాడు అని బైబిలు ఘంటాపథంగా చెబుతుంది. అందువలన ఆయన మాత్రమే 'పూజార్హుడు'.ఇది మన మరణాంతరం గుర్తుంచుకొని ప్రకటించాల్సిన అపూర్వమైన సంగతి. అట్టి వారికి మాత్రమే వర్తించే బైబిల్లోగల మరోమాట ... యేసురక్తం ప్రతిపాపములనుండి మనలను పవిత్రులనుగా చేయును. ఆయన రక్తం వలన పవిత్రులమవుతున్న మనలో ఎవరూ ఆయనతో సమానులంకామన్నది మరోసారి చెబుతున్నా. ఇంత చెప్పినా మా బోధకుల్నే, మా నాయకుల్నే యేసుకంటే ఎక్కువగా తలచుకొంటామని ఎవరైనా అనుకుంటే అదివారి అవివేకతే కాగలదు. అలా తలచుట ఎంతో ఆశ్చర్యం, మరెంతో బాధాకరం. క్రైస్తవులు ఆయనను ప్రకటిస్తూ జీవితాలను భూమిపై ముగించి ఆయన సన్నిధికి చేరుటకే పిలువబడ్డారు. ఆయన మనల్ని పిలిచిన పిలుపును గుర్తించి, గౌరవించి నెరవేరుద్దాం. ఆ 'పూజార్హున్ని' అందరిచే పూజించేవారిగా మలుద్దాం. ఆయన మానవాళికై చేసిన కార్యాలు ప్రకటిద్దాం! అట్లు వీలుకానివారు ప్రకటించు అనేకులకు సహకరిస్తారని నమ్ముతున్నాము. యేసుక్రీస్తు జనన, మరణ, పునరుత్థానాలే సువార్త. ఆ సువార్తను ప్రకటిస్తూ మనవలే అందరూ వారి మరణాంతరం ఆయన సన్నిధికి చేరేట్లు చేయాలి. నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించుమన్న ప్రభువు ఆజ్ఞనునెరవేర్చుటంటే అదే. క్రైస్తవలక్ష్యమదే. యేసుక్రీస్తును నమ్ముట కులం, జాతి, మతం(దేవునికివేవీలేవు) మారుట కాదు. వారి మనసు మారుటేనన్నది బలంగా ప్రకటించాలి.

**క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమపరుస్తున్నప్పుడు మనలో కొందరిలా ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోలికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో 'క్రైస్తవనాడు' తొలినాళ్లనుంచీ చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇందుకు భిన్నంగా చాలామంది ఇతరుల గ్రంథాలు, విశ్వాసుల జోలికెళ్తూ వివాదాలకు కారణమౌతున్నారన్నది వింటున్నాం. ఇది లేఖన వ్యతిరేకమన్నది బైబిల్లో పట్టున్నవారిమాట. లోపల పేజీల్లో బైబిలుకు సంబంధించిన అనేక వివరణలు ఇస్తూ విశ్వాసులను కాపర్లను బలపరుస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. అందెట్టి సందేహాలు, ప్రశ్నలున్నా కార్యాలయానికి ఉత్తరం వ్రాయండి. మీరు వ్రాసిందాన్నిబట్టి మరింత వివరణ తదుపరి పేపర్లలో ఇస్తాం.**

**-ఎడిటర్**




# వ్యక్తి ఆరాధన

నేడు అనేక సంఘాల్లోను, విశ్వాసుల్లోను తండ్రియైన దేవునిని, కుమారుడైన యేసుక్రీస్తును ఆరాధించువారు తగ్గుతున్నట్లు చూడగలం. అలా అన్నందుకు కోపగించకండి. ఆ మాట సత్యదూరం కాదు. తమను నడిపే కాపర్లు లేక సువార్తికులు పేరేదైతేనేం వారిని ఆరాధించువారే ఎక్కువై పోతున్నారు. దేవునిని, యేసును ఎవరేమని విమర్శించినా వీరు పెద్దగా చలించరు. అదే వారిని నడిపే నాయకున్ని ఏమైనా అన్నారో ఇక అంతే సంగతులు! అన్న వారిపై అంతెత్తున లేస్తారు. అందులో నిజమెంత అన్న ఆలోచన కూడా రాదు వీరికి. వీరి హృదయం నిండా ఆయా నాయకులు, కాపర్లే నిండి ఉంటారన్నది సత్యదూరం కాదు. అందువల్ల అట్టివారి హృదయాల్లో ఇక యేసుకు చోటెక్కడ? ఆలోచించాలి! పోనీ వీరి నాయకులేమైనా వీరిని బ్రతుకునంత కాలం వీరిని కాపాడగలరా? నడపగలరా? అలా నడపాలంటే వారు, వీరూ బ్రతుకుండాలిగా?! మరణం వరకు అలా వారు కలిసి జీవించుట అసాధ్యం! అదే మన సాంగత్యం జీవం గల దేవునితోనైతే.. ఆలోచించండి! దేవుడు ఎప్పుడూ అందర్నీ కాపాడగలరు కదా. మనం జీవితం ముగిసేవరకు ఆయన కాపాడగలరు. మరణాంతరం కూడా ఆయన మన ఆత్మను రక్షించగలరన్న లేఖనాలే మనకెంతో ఆదరణ.. కాదంటారా? ఆలోచించండి. ఎంత గొప్పవారైనా మనల్ని ఈ లోకాన నడిపే వారు ఒకర్ని ఒకరు ఎడబాయక తప్పదు. దేవుడెన్నడు ఎడబాయడు.లోకాన నేడు అనేకులు ఆరాధించే వారి నాయకులు లేక కాపర్ల దగ్గరే కడవరకూ వారు ఉండగలరన్న గ్యారంటీ కూడా లేదు. ఏ మాత్రం తేడా వచ్చినా వారి మధ్యన విభేధాలు వచ్చి వీడుట ఖాయం. నాయకత్వ మార్పు అప్పుడు తప్పదు. ఈ లోకాన ఎలా ఉన్నా, ఎవరి చెంత ఉన్నా బైబిల్లో గల లేఖనాలను ఎరుగుతూ అందరూ బలపడాల్సిందే. 'తండ్రియైన దేవుడు, కుమారుడైన యేసుక్రీస్తు వారే మన హృదయంలో నిండాలి. తద్వారా మన బ్రతుకులు పండాలి'. మీలో అనేకులు ఇప్పటికే అటువంటి వ్యక్తి ఆరాధనల్లో కొట్టుమిట్టాడుతుండవచ్చు. మీరట్టివారైతే దయచేసి అట్టి వ్యక్తి ఆరాధనను వీడండి. దేవుని శక్తినే ఆశ్రయించండి. అపుడు చూడండి ఈ లోకంలో మీ బ్రతుకులెంత విస్తరింపబడతాయో. స్వతంత్రులై దేవుని దయతో బహుగా విస్తరింపబడాలంటే.. మీరు సొంతంగా సేవలో ఫలించాలంటే.. లేక లోకంలో ఫలించాలన్నా తగు సహాయం దేవుడే చేయగలరు. గమనించి వ్యక్తులపై అభిమానం చూపండి. దురభిమానం కూడదని తెలుసుకోండి. సద్విమర్శలు చేయువారిని బట్టి సరిచేసుకోండి. మరోసారి చెప్తున్నా.. మీ నాయకులపై అభిమానం పెంచుకుంటే పర్వాలేదు. ఆ అభిమానంతో మీ బ్రతుకులను క్రీస్తుకు దూరం చేసుకోకండి సుమా! ఒకవేళ ఆ నాయకులు మిమ్మల్ని దూరం పెడితే లేక ఆ నాయకులు చనిపోతే... మీ పరిస్థితేంటి? ఒకసారి ఆలోచించండి. ఎల్లప్పుడూ జీవించే దేవునినే మీ హృదయంలోనూ, ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ ఉంచుకోండి. వ్యక్తుల్ని ఆరాధించువారు దేవునిలో రాను రాను ఎదుగుదలనుకోల్పోతారు. తుదకు భ్రష్టులైపోయేందుకూ ఆస్కారముందని గ్రహించండి. మీరలా ఉంటే ఇప్పటి నుండైనా మారండి. మార్పు దేవుని కిష్టం. అట్టి వారిని తదుపరి దినాల్లో బహుగా ఫలించునట్లు దేవుడు చేయ సమర్థుడు. అట్టి దేవున్నే మనం అనుదినం బైబిలు ద్వారా ఎరుగుతున్నాం. ఎరిగిన దేవున్ని, ఆయన కుమారుడైన యేసుక్రీస్తు వారిని కలిగుండాలి. ఆ విషయం మన బ్రతుకుల్లో ఇతరులకు స్పష్టంగా కన్పడాలి.

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



# అతిశయం

ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఓ విషయంలో అతిశయం కన్పడుట సహజం. మనుష్యులు అతిశయించుట మంచిదే! కానీ తాము కన్పరచే అతిశయం ఎదుటి వారిని దూరం చేయకూడదు. అట్టి అతిశయం మనిషిని పతనానికి చేరుస్తుంది. తమనెవరికీ దూరం చేయని అతిశయమే ఉత్తమాతిశయమని గ్రహించు వారే విజ్ఞులు. ఇట్టి అతిశయముంటుందా? అసలు అతిశయమంటేనే ఎదుటి వారిని ఏకొంతైనా నొప్పించేది కదా అన్న అనుమానం మీకు రావచ్చు. నిజమే! లోకంలో గల విషయాలను బట్టి ఎవరు అతిశయించినా ఎదుటివారికి నొప్పి కలగొచ్చు. తద్వారా ఒకరియందొకరు ద్వేషాభావాలను పెంచుకొనేందుకు ఆస్కారముంది. లోకానికి భిన్నంగా ఉండేదే పరలోకం. పరలోకానికి మార్గాన్ని తెలిపే బైబిలు 'అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెనని' అంటుందని గమనించాలి. ప్రభువునందు అనగా వాక్యమందు అతిశయించువారు దేవునికిష్టులు. అది దేవుని చిత్తం. మనలో ఎవరైనా వాక్యంలో అతిశయించుట కన్పడితే దేవుని వాక్యసారాంశాన్ని బట్టి వారిని గౌరవించాలి. వారిలా అతిశయించేందుకు ప్రయత్నించాలే గాని వారిని చూసి ఈర్ష్యాసూయలు చెందరాదన్నది గమనార్హం. వాక్యంలో అతిశయించు వారిని చూసి సజ్జనులైతే సంతోషిస్తారు. దుర్జనులైతేనే ఈర్ష్యాసూయలకు లోనై అంతకంతకు చెడిపోవుదురని బైబిలు పండితులు, పెద్దలు చెప్పిన మాటలెంతైనా నమ్మదగినవే సుమా! లోకాతిశయం అందరిని దూరం చేస్తుంది. దైవాతిశయం సజ్జనులను పురిగొల్పుతుందన్నది మన మస్తిష్కాల్లో నిక్షిప్తమవాలి. అపుడే దేవునిలో అనగా వాక్యంలో ఎదుగగలం, అతిశయింపగలం. తద్వారా అతిశయించువాడు ప్రభునందే అతిశయింపవలెనన్న వాక్యాన్ని మనలోనూ నెరవేర్చుకోగలం! ఏమంటారు?

(ఇది మునుపటిదే పాఠకుల కోరికపై మరలా ఇవ్వడమైనది)

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి" ★

ఎడిటర్ కుటుంబీకులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కాకండి.

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి 'క్రైస్తవనాడు' స్వరచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి. మీ పరిచర్యా వివరాలు తెలిపి ప్రచురింపజేసుకోండి.

# దేవుని జ్ఞానం – మానవ విజ్ఞానం

■ బ్రదర్ వై.లీలా రవిరాజు

బైబిల్ / దేవుని మాట × సైన్స్ శాస్త్రజ్ఞుల / మాట



## ఆయన వాటిని నిత్యస్థాయువులుగా స్థిరపరచియున్నాడు; ఆయన వాటికి కట్టడ నియమించెను; ఏదియు దాని నతిక్రమించదు ★


"సూర్యుడి నుంచి ఏడో స్థానంలో ఉన్నప్పటికీ మూడో అతిపెద్ద గ్రహం యురేనస్. ఒక ద్రవ్యరాశి పరంగా చూస్తే నాలుగో పెద్ద గ్రహం. కానీ, చిత్రమేంటంటే...... 1781 దాకా ఈ గ్రహాన్ని ఎవరూ చూడలేదు! సూక్ష్మదర్శిని (టెలీస్కోపు) సాయంతో మనం కనిపెట్టిన మొట్టమొదటి గ్రహం యురేనస్. ఇంతకీ.... ఆ కనుక్కున్నది ఎవరో తెలుసా? విలియం హెర్షెల్.

### తోకచుక్క కాదు!

మొదటిసారి చూసినపుడు హెర్షెల్ ఈ గ్రహాన్ని తోకచుక్క అనుకున్నాడట. కొన్నాళ్ళపాటు పరిశీలించి గానీ చివరికి గ్రహంగా తేల్చుకోలేకపోయాడు. కనిపెట్టిన ప్రతి గ్రహానికి పేరుపెట్టినట్టుగానే దీనికి కూడా జార్జ్ అనే పేరు పెడదామని అనుకున్నాడు. మిగతావారికి నచ్చకపోవడంతో చాలా కాలం పాటు 'హెర్షెల్' అనే పేరే ఉండిపోయింది. మరి మిగతా గ్రహాలకు పౌరాణిక పేర్లు ఉండగా, ఈ గ్రహానికి వేరే పేరు ఉంటే బాగుంటుందా? అందుకని 'యురేనస్' అన్న పేరు పెట్టేశారు. అది గ్రీకు పురాణాల్లోని భూదేవి భర్త పేరు.

### ఎంత చల్లనో!

ఈ గ్రహంలో ఉండేదంతా వాయువులే. హైడ్రోజన్ 82 వంతులు ఉంటే, హీలియం 15 వంతులు ఉంటుంది. మిగతాది మీథేన్ వాయువు. అందుకని మానవులు ఈ గ్రహం మీద నిలబడడం సాధ్యం కాదు. ఒకవేళ దీని దగ్గరికి వెళ్లినా అసలు ఉండలేరు, ఎందుకంటారా? ఈ గ్రహం చాలా చల్లగా ఉంటుంది. దీని ఉపరితలం ఉష్ణోగ్రత -197



డిగ్రీల సెంటీగ్రేడ్. అంత చల్లదనం ఎందుకంటే... సూర్యుడికి యురేనస్‌కి మధ్య దూరం 287,10,00,000 కిలోమీటర్లు! సూర్యుడికి శనికి మధ్య ఎంత దూరమో, యురేనస్‌కు శనికి మధ్య అంత దూరం ఉంటుందంటే ఎంత దూరమో మీరే ఊహించుకోవచ్చు.

### నీలం రంగు!

భూమి నుంచి చూస్తే యురేనస్ నీలం , ఆకుపచ్చ రంగుల కలబోతగా కనిపిస్తుంది. అలా ఎందుకో తెలుసా? దీని ఉపరితలం మీద మీథేన్ వాయువు ఎక్కువ కాబట్టే! ఇక యురేనస్ లోపలికి వెళ్తున్న కొద్దీ మీథేన్ వాయువుతో పాటు నీరు, మంచు అమోనియా కలసిన ఆవరణ ఉంటుంది. అంతర్భాగం మాత్రం సిలికాన్ రాయితో కూడి గట్టిగా ఉంటుంది. ఇక ఈ గ్రహం వెలువరించే అయస్కాంత క్షేత్రం భూమి అయస్కాంత క్షేత్రం కన్నా 50 రెట్లు ఎక్కువ.

### 42 ఏళ్ల పాటు చీకటే!

మిగతా గ్రహాల భ్రమణానికీ దీనికి చాలా తేడా ఉంది. ఈ గ్రహం 98 డిగ్రీల పక్కకు ఒరిగి తిరుగుతుంది. అంటే మీరు పక్క మీద పడుకొని మీ చుట్టూ మీరు తిరిగితే ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకుంటే తెలుస్తుంది. ఈ గ్రహం తిరిగే పద్ధతి కూడా అలాగే ఉంటుంది. సెకనుకి 6.82 కిలోమీటర్ల వేగంతో ఒకసారి సూర్యుడ్ని చుట్టి రావడానికి ఏకంగా 82 ఏళ్ళు పడుతుంది. దాంతో ఒకపక్క 42 ఏళ్ళు వెలుతురు...... మరో పక్కన 42 ఏళ్ళ పాటు చీకటే. ఇంతకీ ఈ గ్రహం పక్కకి ఒరిగిపోవుట కు కారణం... ఈ గ్రహం పుట్టిన సమయంలోనే ఏదో పెద్ద గ్రహం లాంటిది ఢీకొట్టడమేనని శాస్త్రజ్ఞుల భావన. ఇక ఈగ్రహం తన చుట్టు తాను తిరగడానికి పట్టే కాలం 17.24 గంటలు! అంటే భూమి కన్నా 7 గంటలు చిన్నది.

**టి వి బోధకుల్లారా..!** విశ్వాసుల్ని కనీసం ప్రార్థనైనా చేసుకోనివ్వరా?! మీకు చెబితే అదీ మీరే చేసేస్తారా? వారి గొంతును చనిపోయేవరకు దేవునికి వినబడనివ్వరా? యేసు తన శిష్యులకు ప్రార్థన నేర్పారన్నది మరిచారా? మిమ్మల్నే గ్రుడ్డిగా నమ్మే విశ్వాసులకు ప్రార్థన చేసుకోమని ఇంకెప్పుడు చెబుతారు? అలా చెబితే మీ ఆదాయం పోతుందన్న వ్యాపారాత్మక ధోరణి మీచే అలా చెప్పనివ్వట్లేదా? – బ్రదర్ వైకెయార్ (మరింత విశ్లేషణ రాబోవు పేపర్లో)

'క్రైస్తవనాడు'
పేపర్లు మీరు మిస్సయ్యారా?
అయితే ఈ క్రింది వెబ్‌సైట్ ను
దర్శించండి.
www.christavanaadu.weebly.com

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ. ఫోన్ : 9866113513

సం॥ చందా ₹ 200. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!**
చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 9346960601 / 8885362270 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★

'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

Online A/C : CHRISTAVANAADU, Current A/C : 13 96 111 00 00 00 52
Andhra Bank, Adarsha Nagar Branch, Visakhapatnam - 530 040
IFSC Code : ANDB0001396

**ఎందుకు?! :**

'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

**TELANGANA :** CHRISTAVANAADU
C/o A.Prem Kumar, 1-5-89/6,
CSI Mission Compound,
Sadasivpet, Medak Dist - 502 291
Telangana State, INDIA. Call : 8885362270

**ANDHRA PRADESH :** CHRISTAVANAADU,
13 - 410 / 1 / 2, Ambedkar Nagar, Arilova,
Visakhapatnam - 530 040.
Andhra Pradesh State, INDIA.
Call : 9346960601 / 9490266640

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక
16-30 సెప్టెంబర్ 2015

# యాత్రికుని ప్రయాణం



బిషప్.ఎం.ఎ.పాల్

మానవ జీవితం వికసించిన పువ్వువంటిదని, నీటి బుడగ వంటిదని, నీడలాంటిదని ఒక కథను పోలినదని, అది ఒక యాత్ర అని రకరకాలుగా చెప్పుకోవడం మనము వింటూ ఉంటాము; నిజమే. అయితే ఈ భూమిమీద పుట్టిన ప్రతి మానవుడు ఒక దినాన చేరవేసిన గమ్యాన్ని సృష్టికర్త నిర్ణయించాడు. అదే జీవముగల దేవుని నివాసస్థలమైన "సీయోను". అదే నిత్యరాజ్యం. కొందరు యాత్ర ప్రారంభించి వైఫల్యం చెందుతున్నారు. కారణము ఏమిటంటే దేవుడు తమకు సిద్ధపరచిన గమ్యమును గూర్చి తెలియకపోవుట, తెలిసినా దానిని గూర్చిన నిరీక్షణ లేకపోవుటయే.

పరిశుద్ధ గ్రంథములో ఒక వ్యక్తి 120వ కీర్తనలో యాత్ర ప్రారంభించి 134వ కీర్తనలో స్తుతి ఆరాధన యోధుడైన దావీదును జ్ఞాపకం చేసుకుంటున్నాడు. అతని యాత్ర ప్రారంభ దినాలలో తాను కేదారు గుడారములలో నివసించానని చెప్పుచున్నాడు.

**"అయ్యో, నేను మెషెకులో పరదేశినై యున్నాను. కేదారు గుడారముల యొద్ద కాపురమున్నాను. కలహప్రియునియొద్ద నేను చిరకాలము నివసించినవాడను. నేను కోరునది సమాధానమే. అయినను మాట నా నోట వచ్చినతోడనే వారు యుద్ధమునకు సిద్ధమగుదురు"** (కీర్తన 120:5,6,7).

కేదారు నివాసులు ఇష్మాయేలు సంతానము. వారు యుద్ధ కాంక్ష కలిగినవారు. సమాధానము కోరుకొనని జనాంగము. వారితో ఈ యాత్రికుని ప్రయాణం ప్రారంభంలో ఆనందముగా ఉన్నప్పటికీ చివరికి చేదు అనుభవాన్ని మిగిల్చింది. అతడు దుష్టసహవాసము వలన చాలా వేదన అనుభవించాడు. అతనికి కలిగిన నిందలు, అవమానాలు, అతనిలో దీనత్వము కలుగజేసాయి. కనుకనే యాత్రికుని దర్శనం మారినది. అతడు ఓ క్రొత్త సమూహమును చూచి వారితో సాంగత్యము చేసాడు. ఆ సమూహపు ప్రభావము వలన కొండలవైపు కన్నులెత్తాడు; క్షేమము నెమ్మది కొరకు పైనున్న వాటిని వెదకుట ప్రారంభించాడు. **దేవుని వలననే తనకు సహాయము దొరుకునని గుర్తించాడు.** కీర్తన 121:2

స్నేహితులారా! దేవునిని ఆరాధించు ఒక సమూహము యాత్రికుని జీవితాన్ని ప్రభావితం చేసినప్పుడు మానవాళి కొరకు పవిత్రమైన రక్తాన్ని చిందించిన యేసు క్రీస్తును రక్షకునిగా కలిగిన మనము ఎందరి జీవితాలను ప్రభావితం చేయగలమో ఆలోచించండి.

**"దేవుని మందిరమునకు జనులు వెళ్ళుదుమని చెప్పినప్పుడు అతడు బహుగా సంతోషించాడు"** (కీర్తన 122:1). అప్పటివరకు సృష్టికర్తకు బదులుగా సృష్టాన్ని పూజించిన యాత్రికుడు సృష్టికర్తను ఎరిగిన తరువాత తన జీవితపు గురిని, గమ్యాన్ని గుర్తించాడు.

**"యెహోవా సీయోనును ఏర్పరచుకొని యున్నాడు. తనకు నివాసస్థలముగా దానిని కోరుకొనియున్నాడు. ఇది నేను కోరిన స్థానము, ఇది నిత్యము నాకు విశ్రమ స్థానముగా నుండును. ఇక్కడనే నేను నివసించెదను. దాని ఆహారమును నేను నిండారులుగా దీవించెదను. దానిలోని బీదలను ఆహారముతో తృప్తిపరచెదను"** (కీర్తన 132:13,14,15).

ఈ దినాలలో అనేకులు చుక్కానిలేని నావవలె గమ్యము లేనివారై తరుగుతూ ఉంటారు. మరికొందరు పరలోక రాజ్యములో చేరు మార్గము తెలిసిన అది మా భక్తి మార్గము కాదు అంటారు. గమ్యము లేనివారైనా, దేవుడు సిద్ధపరచిన స్థలమునకు చేర్చు యాత్ర చేయనివారెవరైనా అగ్ని గుండములో ప్రవేశింపక తప్పదు. అది సాతాను అతని అనుచరులకు సిద్ధపరచిన స్థలము. అక్కడికి చేరిన తరువాత పశ్చాత్తాపపడినా ప్రయోజనం ఉండదు. ధనవంతుడు లాజరు చరిత్ర మీకు తెలియనిది కాదు కదా! యాత్రికుడు విశ్వాసులకు తండ్రియైన అబ్రహాము గాని, యాకోబు గాని, ఇస్సాకును గాని జ్ఞాపకము చేసుకొనక దావీదును జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఎందుకు?

## 1. దావీదు యొక్క సమర్పణా జీవితం :

**"యెహోవా, దావీదునకు కలిగిన బాధలన్నిటిని అతని పక్షమున జ్ఞాపకము చేసికొనుము. అతడు యెహోవాతో ప్రమాణపూర్వకముగా మాట యిచ్చి, యాకోబు యొక్క బలిష్ఠునికి మ్రొక్కుబడి చేసెను. ఎట్లనగా యెహోవాకు నేనొక స్థలము చూచువరకు యాకోబు యొక్క బలిష్ఠునికి ఒక నివాసస్థలము నేను చూచువరకు నా వాసస్థానమైన గుడారములో నేను ప్రవేశింపను, నేను పరుండు మంచము మీదికెక్కను. నా కన్నులకు నిద్రరానియ్యను. నా కన్ను రెప్పలకు కునికిపాటు రానియ్యననెను"** (కీర్తన 132:1-5).

పై వాక్యము దేవుని యెడల దావీదునకు గల ప్రేమను, అతని యథార్థ హృదయమును తెలియజేయుచున్నది. దేవునికి గుడారము నిర్మింపబడునంత వరకు తన సుఖాన్నంతటిని త్యాగం చేయుటకు సిద్ధపడిన వ్యక్తి దావీదు. **'నన్ను ఘనపరచువానినే నేను ఘనపరుస్తారు'** అని సెలవిచ్చిన దేవుడు తనను ఎంతగానో ఆరాధించు హృదయముగల గొఱ్ఱెలకాపరియైన దావీదును ఇశ్రాయేలీయులకు మహారాజుగా చేసాడు. దావీదు దేవుని సాక్ష్యపు గుడారపు విషయమై ఎంత శ్రద్ధ కలిగియున్నాడో ఇశ్రాయేలీయుల చరిత్రను వివరించిన స్తెఫెను మాటలలో గమనించగలము. **"సాక్ష్యపు గుడారము దావీదు దినముల వరకు ఉండెను. అతడు దేవుని దయను పొందెను"** (అపో. 7:4,5). దేవుడు చూపిన మాదిరి చొప్పున మోషేచేత తయారుచేయబడిన సాక్ష్యపు గుడారము యెహోవా నివాసస్థలమని, ఆయన మహిమ ఎల్లప్పుడు ఆ గుడారముపై ఉన్నదని గుర్తించిన దావీదు, దాని విషయమై మిక్కిలి శ్రద్ధను కనుబరిచాడు. కనుకనే అతడు దేవుని దయను పొందాడు.

ఈ రోజుల్లో అనేకులు సేవ చేయుచున్నాము అంటున్నారు కానీ, సేవ ఎలా చేస్తున్నారు అనునది ప్రాముఖ్యం. దేవుని చిత్తానుసారమైన సేవ మిమ్మును మాత్రమే గాక మీ ద్వారా అనేకులలో శుభప్రదమైన నిరీక్షణ కలుగజేసి, దేవుని దయను పొందుటకు యోగ్యులుగా చేసి, నిత్యరాజ్యమునకు చేర్చగలదు. దైవజనుడైన మోషే దేవునియొద్దనుండి ధర్మశాస్త్రమును పొందినవాడు; దేవునితో ముఖాముఖిగా మాట్లాడినవాడు. అంతటి దైవజనుడు ఒకరోజున ప్రజలయెదుట దేవుని నామమును పరిశుద్ధపరచలేకపోయాడు. అంతే! లక్షలకొలది ఇశ్రాయేలీయులను వాగ్దానదేశమునకు నడిపించుటకు నాయకునిగా ఎన్నుకొనబడిన మోషే ఆ దేశములో ప్రవేశించకుండానే తనయాత్రను ముగించవలసి వచ్చినది. దేవునిని ఘనపరచని సేవ ముగింపు ఈలాగే ఉంటుంది.

ప్రియులారా! సేవాజీవితంలో దేవునిని ఘనపరచే హృదయం, ఆయన కొరకు సమస్తమును నష్టముగా, పెంటతో సమముగా ఎంచుకొనే మనస్సు కలిగియుండాలి. అప్పుడే ఆయన చిత్తానుసారమైన సేవ చేయగలము. లోకాన్ని, సేవను మిళితం చేస్తే చివరకు గమ్యాన్ని చేరలేం. కొందరు రక్షింపబడినప్పుడే గమ్యాన్ని చేరినట్లుగా భావిస్తారు. అది పొరపాటు. రక్షణ అనునది ఒక వ్యక్తి మార్పు చెందాడు అనుటకు ఒక ప్రాథమిక అనుభవం మాత్రమే. ఆ తరువాత అతడు సజీవయాగముగా తనను దేవునికి సమర్పించుకొనుట ద్వారా పరిశుద్ధపరచబడి, పరిశుద్ధాత్మ అనుభవములో అంతము వరకు కొనసాగినప్పుడు మహిమలో చేర్చబడతాడు. ఇది కడవరి రక్షణ. ఇది ప్రతీ విశ్వాసి గమ్యమైయుండాలి.

దావీదు యెహోవాకు నివాసస్థలము కట్టువరకు నేను నా గుడారములో ప్రవేశింపను అని దేవునితో నిబంధన చేసాడు. అయితే దేవుడు దావీదు హృదయాన్ని, సమర్పణను, త్యాగమును తనపట్ల ప్రేమను యెరిగినవాడై ప్రవక్తను పంపి **"నీ కుమారుని ద్వారా నాకు ఒక మందిరము కట్టబడుతుంది. నీ కుమారునికి నేను తండ్రిగా ఉంటాను"** అని వాగ్దానం చేసాడు **(2 సమూయేలు 7:14).** ఇది దావీదు జీవితంలో ఒక గొప్ప అనుభవం. తండ్రి దేవుని కొరకు తన సుఖాన్ని త్యాగం చేయుటకు సిద్ధపడినప్పుడు దేవుడు అతని కుమారునిగా తండ్రిగా నేనుంటానని వాగ్దానం చేస్తున్నాడు. ప్రియులారా! ఈ అనుభవములో ప్రతి విశ్వాసి, సేవకుడు నడిపించబడాలని నా ఆకాంక్ష.

2. దావీదు తండ్రి స్వభావమును ప్రత్యక్షపరచాడు :

దావీదు కుమారుడైన అబ్షాలోము రాజ్యకాంక్ష కలిగి తండ్రికి విరోధముగా ప్రవర్తించినందున దావీదు సింహాసనం విడిచి పారిపోయాడు. ఆ సమయములో ప్రతి ఒక్కరూ దావీదును కుమారునితో యుద్ధమునకు ప్రేరేపించిన వారే. కానీ అతడు తన కుమారుని హతము చేయుము అని సైనికులకు సెలవియ్యకపోగా, నన్నుబట్టి అబ్షాలోము యెడల దయచూపుము అని బ్రతిమిలాడుట గమనించండి. తన వేదనకు, కన్నీటికి, అవమానానికి కారకుడు కుమారుడే అయినప్పటికి దావీదు తన కుమారుని నాశనాన్ని కోరుకోలేదు. నిజమైన తండ్రి తన పిల్లల నాశనాన్ని కరుకోడు. మరియు వారిమీద ఆధారపడడు; వారి కొరకు తానే సంపాదించి పెడతాడు. వారి కొరకు తనకున్న ద్రవ్యమును వ్యపరచుటకు సిద్ధపడతాడు; ఇది **తండ్రి స్వభావము.** ఈలాంటి మనస్సు కలిగినవారు నేటి క్రైస్తవ సంఘానికి చాలా అవసరం.

అపోస్తలుడైన పౌలు కొరింథి సంఘానికి ఇలా వ్రాయుచున్నాడు. **"నాకు కలిగినది యావత్తు మీ ఆత్మల కొరకు బహుసంతోషముగా వ్యపరచెదనని; నన్ను నేను వ్యయపరచుకొందును"** అని అంటున్నాడు **(2 కొరింథి 12:15)**. సేవకులు సంఘానికి కాపరులు. వారు తండ్రి మనస్సు కలిగినవారుగా ఉన్నప్పుడు ఆ సంఘములోని పిల్లలు పోషింపబడి, సిద్ధపరచిన గమ్యాన్ని చేరుకోగలరు.

## 3. శ్రమల ద్వారా విధేయత నేర్చుకున్నాడు :

గొఱ్ఱెల కాపరి అయిన దావీదు ఫిలిష్తీయుడైన గొల్యాతును సంహరించాడు. ఆ తదుపరి రాజైన సౌలు తనకు, తన సైన్యానికి చేసిన మేలుకు ప్రతిగా దావీదుకు కీడు చేయనుద్దేశించాడు. నిర్నిమిత్తముగా దావీదును తరిమాడు అతనికి కొండలలో అరణ్యములలో తిరుగవలసిన పరిస్థితి ఏర్పడినది. ఓ చోట శత్రువుల బారినుండి తప్పించుకోవడానికి వెఱ్ఱివానివలె ప్రవర్తించాడు. అతడు శ్రమల కొలిమిలో కాల్చబడ్డాడు. ఒక రోజున తనకున్న సమస్తాన్ని పోగొట్టుకొని, శక్తిలేనంతగా ఏడ్చాడు. అయితే దావీదు జీవితంలో ఒక గొప్ప విశేషమేమంటే – అతడు అన్ని సందర్భాలలో తన గురిని యెహోవా మీద నిలిపాడు; ఆయన యొద్దనే విచారణ చేసాడు. ఆయనయందు భయభక్తులు గలవారికి ఏ మేలు కొదువలేదు అని విశ్వాసముతో చెప్పగలిగాడు. శోధింపబడిన దావీదు సువర్ణముగా మార్చబడ్డాడు. తన శ్రమానుభవములో దేవుడు తనకు తోడుగా వున్నాడని గుర్తించాడు. నా దేవునికి నివాస స్థలము కట్టువరకు నేను నా గుడారములో ప్రవేశింపను అని ప్రమాణము చేసాడు.

ప్రియులారా! శ్రమలు – దీనత్వమును, విధేయతను నేర్పుతాయి. **ప్రభువైన యేసుక్రీస్తు శ్రమల ద్వారా విధేయతను నేర్చుకున్నాడు** (హెబ్రీ 5:8). మనము శ్రమలనుభవించి దేవుని రాజ్యములో చేరవలసియున్నది అని దేవుని వాక్యం చెప్పుచున్నది. యేసుక్రీస్తును రక్షకునిగా కలిగిన మన జీవితాల ద్వారా అనేకులకు క్రీస్తు ప్రేమను ప్రత్యక్షపరచాలి. నిరీక్షణ లేని ప్రతి ఒక్కరిలో నిరీక్షణ కలుగజేయాలి. దావీదు వెళ్ళిన అనుభవాలే యాత్రికుడు దావీదును జ్ఞాపకం చేసుకోవడానికి ప్రధాన కారణం. ఈ అనుభవాలు మనము గురిని చేరుటకు ఉపయోగపడు సాధనాలు.

పాఠకులారా! దావీదు నిర్మించాలని తీర్మానించుకున్నది దేవుని మందిరం; అది భూసంబంధమైనది. క్రొత్త నిబంధన కాలములో నివసించుచున్న మనము దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నామని అపోస్తలుడైన పౌలు సెలవిచ్చుచున్నాడు (ఎఫెసీ 2:19-22). **"తన యెడల యథార్థ హృదయము కలవారి కొరకు యెహోవా కనుదృష్టి లోకమంతట సంచారము చేయుచున్నది"** కనుక మనము యాత్రికుని వలె యథార్థ హృదయము కలవారమై, దావీదు వలె దేవుని దయను పొంది, ఆయనకిష్టానుసారమైన వారిగా జీవించాలని నా ప్రార్థన.

**దావీదు యెహోవాకు నివాసస్థలము కట్టువరకు నేను నా గుడారములో ప్రవేశింపను అని దేవునితో నిబంధన చేసాడు. అయితే దేవుడు దావీదు హృదయాన్ని, సమర్పణను, త్యాగమును తనపట్ల ప్రేమను యెరిగినవాడై ప్రవక్తను పంపి "నీ కుమారుని ద్వారా నాకు ఒక మందిరము కట్టబడుతుంది. నీ కుమారునికి నేను తండ్రిగా ఉంటాను"** అని వాగ్దానం చేసాడు.

## విశాఖ క్రైస్తవ సంఘానికో ప్రత్యేక విజ్ఞప్తి

మన దేశ క్షేమాభివృద్ధి కొరకు ప్రతి ఆదివారం ఆరాధనల్లో రెండు ప్రత్యేకమైన ప్రార్థనా విన్నపములు గుర్తుచేసుకోగలరు

1) మన దేశమంతా దేవుని గూర్చిన జ్ఞానములోనికి రావాలని
2) ప్రభువు ఇచ్చిన ఆజ్ఞ - మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించబడాలని
3) భారతదేశ ఐకమత్యం కొరకు ప్రార్థన చేయండి – బిషప్ ఎం.ఎ.పాల్



విధేయులుగా ఉంటే దేవుని గొప్ప కార్యాలు మీ జీవితాల్లో తప్పక చూడగలరు. మీ విశ్వాసం ఆవగింజంత ఉంటే చాలన్నది దేవుని మాట.
– బ్రదర్.రత్నకుమార్, గుంటూరు.

# సత్యానికి నిర్వచనం...!

క్రైస్తవనాడు పాఠకులందరికీ ప్రభువైన యేసుక్రీస్తు నామమున వందనాలు. ప్రపంచంలో ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పత్రికలు ఎన్ని ఉన్నప్పటికీ మనిషికి అవసరమైన సత్యాన్ని చెప్పడంలో మాత్రం అత్యధిక శాతం విఫలమయ్యాయనే చెప్పవచ్చు. మన దేశ ప్రజలచేత జాతిపితగా పిలువబడుతున్న మహాత్మాగాంధీ 'సత్యమేవ జయతే' అనే నినాదానికి ప్రజల్లో బహు ప్రాచుర్యం తీసుకొచ్చారు. కాని ఆయన సత్యానికి నిర్వచనం ఈ సమాజానికి చెప్పలేదనే అత్యధిక క్రైస్తవుల నమ్మకం. త్వరలో యేసుక్రీస్తుగా నటించబోతున్నట్లు సినీవర్గాలచే చెప్పబడుతున్న పవన్‌కళ్యాణ్ ఈ మధ్య ఓ సినిమాలో 'సత్యమేవ జయతే'ని గురించి మాట్లాడుతూ.. 'సత్యమేవ జయతే' అంటే సత్యము గెలుస్తుందని కాక సత్యము మాత్రమే గెలుస్తుందని విశ్లేషించారు. అది ఓ సినీ రచయిత విశ్లేషణ. దాన్ని నటుడిగా ఆయన పలికారు. ఈ విశ్లేషణ బైబిలుకు అనుకూలంగా ఉండుట హర్షించదగిన పరిణామం.

ఇంతకూ సత్యమంటే? మనం నిత్యం చదివే బైబిలు స్పష్టంగా బయల్పరచుట మనకానందం.

**నీ వాక్యమే సత్యము ★**

చదివారుగా! బైబిలు దేవుని వాక్యమే అనగా మాటలే సత్యమని ఖండితంగా చెప్పింది. కాబట్టే ఎన్ని విమర్శలనైనా తట్టుకొని దీటైన జవాబు చెప్తూ నిలబడిన గ్రంథంగా బైబిలును మనం గుర్తిస్తున్నాం. ఎవరికైనా అందెట్టిసందేహమున్న తప్పని సరిగా పరీక్షించొచ్చు. మనుష్యుల జ్ఞానానికి ఎల్లప్పుడు అతీతంగానే బైబిల్లో జ్ఞానం కన్పడుతుంది. అందుకనేక రుజువులు బైబిల్లో గోచరిస్తాయి. సైన్సు అభివృద్ధి చెందుతున్న కొలది బైబిల్లో గల దేవుని మాటలు మరింత ఘనంగా లోకానికి కన్పడుట చూడగలుగుతున్నాం. ఎందుకంటే అవి దేవుడు తన్ను గూర్చి తాను తెలియజేసుకొనుటకు మనుష్యులకు తనకిష్టమైన వారిచే చెప్పించిన మాటలు. ఆ మాటలే మనుష్యులకు ఇహమందు ఓ క్రమమైన మార్గాన్ని చూపుతాయి. దేవుడు చెప్పిన మాటలే వాక్యములుగా మనం బైబిల్లో చదువుతున్నాం. వాటిని 'సత్యము'గా మనము నమ్ముతూ అనేకులకు చెబుతున్నాం. అందుకనుకూలంగానే ఆ వాక్యమే 'కృపా' 'సత్య' సంపూర్ణునిగా యేసుక్రీస్తు మనమధ్య నివసించెనని బయల్పరచింది. అందువలనే యేసుక్రీస్తు ప్రపంచానికి తెలియజేస్తూ...

**నేనే మార్గమును 'సత్యము'ను, జీవమును నా ద్వారానే తప్పయెవడును తండ్రి యొద్దకు రాడు. ★**

అని ఖండితంగా చెప్పారు. ప్రభువైన యేసు చెప్పిన మాటలు గతించవని కూడా చెప్పారు. ఆ మాటల్లో జీవముందని అవి ఎన్నటికీ మరణించవని గ్రహించాలి. మహాత్మ గాంధీ కూడా ప్రభువైన యేసు మాటలను వాడారు. నేటికి ఆ మాటలు మన దేశస్థులచే గాంధీ మాటలుగానే గుర్తించబడు తున్నాయి గాని అవి యేసు మాటలుగా గుర్తించువారు బహు కొద్దిమందే. ఎందరో మహా మహులకే బైబిల్లో గల దేవుని మాటలు అనగా 'సత్యము' అర్థము కాలేదని చరిత్రను తరచిచూస్తే గ్రహించగలం. అందుకు సాదృశ్యంగా యేసు జీవించిన కాలంలో యేసుక్రీస్తుని పిలాతు అన్న రోమా గవర్నర్ ముందు నిలబెట్టినప్పుడు.. యేసుక్రీస్తు గవర్నర్‌తో – **'సత్యమును' గూర్చి సాక్ష్య మిచ్చుటకు నేను పుట్టితిని ★** అని చెప్పగానే పిలాతు కుతూహలంతో యేసును అడిగిన ప్రశ్న– **'సత్యమేమిటో 'అని ఆయనతో చెప్పెను.★** అప్పటి రోమా ప్రభుత్వపు గవర్నర్‌కే సత్యం అంటే ఏంటో తెలియక యేసుక్రీస్తును అడిగాడు. అలాంటిది ఇక సామాన్యులకేమి తెలుస్తుంది? సత్యం అంటే 'నిజం' లేక అబద్ధం కానిదని అంటారు. అది సరియైనదని మనం నమ్మేందుకు ఆస్కారం లేదు. ఎవరైనా సత్యాన్ని ఎందుకు తెలుసుకోవాలి? అన్న ప్రశ్నకు సమాధానం తెలియాలంటే ప్రపంచంలో ప్రతీ మనిషి కూడా బైబిలు చెంతకు రావాల్సిందే. ప్రపంచ వ్యాప్తంగా నాటి నుండి నేటి వరకు అనేకులకు తెలియని సత్యమే ఈ రోజు క్రైస్తవుల చేతిలోఉన్న ఈ వాక్యము అనగా బైబిల్లో గల దేవుని మాటలు.

**ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను..... ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను. ★**

యేసుక్రీస్తు ఆది నుండి ఉన్నవారు. కలిగియున్నది ఏదియు కూడా ఈయన లేకుండా కలుగలేదు. ఆయనే మార్గం, సత్యం, జీవమునై యున్నారు. క్రీస్తు ద్వారానే తప్ప మరెవరి ద్వారా కూడా మనం తండ్రి (దేవుడు) యొద్దకు వెళ్ళలేమని లేఖనాల ద్వారా ఎంతో చక్కగా అర్థమవుతుంది.

బైబిల్ నందు దేవుని మాటలు నిక్షిప్తమైయున్నవి కాబట్టి ఆ మాటలను గ్రహించాలి. దేవుడంటే మనమనుకున్న నిర్వచనాలు సమాధానాలు తెలియజెప్పి సరిపుచ్చుకోకూడదు. అసలు ఈ వాక్యాన్ని ఎందుకు తెలుసుకోవాలన్న సందేహానికి జవాబుగా ...

**ఆహారమువలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతి మాట వలన నరులు బ్రతుకుదురని నీకు తెలియజేయుటకు.... ★**

**మనుష్యుడు రొట్టివలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాటవలనను జీవించును. ★**

లోకంలో మనుష్యులు సుఖసంతోషాలతో జీవించేందుకు, మరణాంతరం బైబిలు చెప్పినట్లు పరలోకానికి వెళ్లేందుకు అవసరమైనవి ఇక్కడ భౌతిక ఆహారము, అక్కడకు ఆధ్యాత్మిక ఆహారము ఎంతైనా అవసరమని పైన ఇవ్వబడిన వాక్యాలు బయల్పరుస్తున్నాయి. మానవులు దేవుని దృష్టిలో బ్రతకాలంటే...

**నీ వాక్యము నన్ను బ్రదికించియున్నది ★**



స్వర్ణరాజ్‌పాల్, ప్రభురాజ్ పాల్‌లతో బ్రదర్ ఎ. ప్రేమ్ కుమార్, సిస్టర్.శివలక్ష్మి దంపతులు
సదాశివపేట, మెదక్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

భూమి మీద జీవించే సగటు జీవితానికి మనిషి తినే ఆహారం కేవలం శారీరక బలానికి మాత్రమే ఉపయోగపడుతుంది. కాని వాక్యము (దేవుని మాట) మాత్రం మనిషి భూమిపై జీవించినంత కాలం ఆత్మీయంగా దేవునిలో బలపరుస్తుంది మరియు భూమి నుండి కనుమరుగైన తర్వాత కూడా యుగ యుగములు మన ఆత్మలను జీవింపజేస్తుంది. సమాజానికి యేసుక్రీస్తు ఏం ఇచ్చి వెళ్ళారో చూస్తే ...

**వారికి నీ వాక్యమిచ్చియున్నాను ★**

**నీవు నాకు అనుగ్రహించిన మహిమను నేను వారికిచ్చితిని ★**

మనిషికి ఏది అవసరమో అది ఆయనకు తెలుసు కాబట్టే ఆయన వాక్యాన్నిచ్చారు. దాని ద్వారా మనం దేవున్ని ఎరుగగలం. తద్వారా దేవుడిచ్చిన మహిమను పొందుకోగలం. ఈ లోకంలో జీవించినంతకాలం మనిషికి కావల్సినవి అవే. కాబట్టే ఆయన వాటిని ఇచ్చారని బైబిల్లో వ్రాయబడింది. యేసు లోకానికి ఆహారం, బంగారం, ఆస్తులు, వెండి మొ॥నవి ఇచ్చానని ఎక్కడా ప్రస్తావించలేదు. అంటే వాక్యం మన జీవితంలో ఎంత ప్రాముఖ్యమైనదో మనకు ఈ మాటను బట్టి తెలుస్తుంది. మరియు కేవలం ఈ వాక్యమే మనల్ని నిత్యజీవానికి అనగా పరలోకానికి పాత్రులనుగా చేస్తుంది. కాబట్టి ప్రియ పాఠకులారా! గొప్ప గొప్ప వాళ్ళకే సత్యం అంటే ఏంటో కూడా తెలియని నేటి దినాల్లో సత్యం (వాక్యం) బైబిలు చదివి గ్రహించిన వారికి మాత్రమే తెలుస్తుందంటే ప్రపంచం ఆశ్చర్యపోవాలి. దేవుని వాక్యాన్ని చదివి గ్రహించి ఆచరణలో పెట్టువారే లోకానికి సత్యాన్ని విశదపరచగలరన్న బైబిలు పండితుల మాటలను నమ్మాలనిపిస్తుందా ? క్రైస్తవులని పించుకొంటున్న వారిలో అనేకులు ఎంతో గొప్పదైన బైబిలుకు విలువివ్వనివారిగా కనబడుట కడు శోచనీయం. ఒక మత పుస్తకంగా చూచుట ధౌర్భాగ్యం కాదంటారా? బైబిలును కేవలం ఆదివారం పుస్తకంగానే వాడుట ఎంతవరకు న్యాయం? మిగిలిన రోజుల్లోనైనా బైబిలును భద్రం చేస్తారాంటే... ఏ మూలనో, ఏ అటకమీదనో పడేస్తుంటారు. బంగారాన్ని మాత్రం బీరువాలో పెడతారు.ఇంతకూ బంగారం గొప్పదా? బైబిలు గొప్పదా? అట్టివారు చెప్పాలి. బైబిలునే ప్రక్కన పెడితే అందులోని దేవుని మాటలు మనకు ఎలా అర్థమవుతాయి? బైబిలును ప్రపంచ వ్యాప్తంగా ప్రభలింపజేయడానికి ఎంతో మంది క్రైస్తవులు పూనుకున్నప్పటికి బైబిలులో ఉన్న సత్యాన్ని మాత్రం ఈ లోకానికి పరిచయం చేయలేక పోయారు. సత్యం మరుగున పడిందనడానికి ఇంతకంటే నిదర్శన మేముంటుంది. ఒకవేళ వీళ్ళందరూ నిజంగా సత్యాన్నే ప్రకటిస్తే ఇన్ని వేల శాఖలుగా క్రైస్తవ్యం ఎందుకు ముక్కలవుతుంది? ఆలోచించాలి! ప్రపంచానికి చాటిచెప్పాల్సిన క్రైస్తవులే దేవుని జ్ఞానగ్రంథం అయిన బైబిలును (వాక్యాన్ని) చేతబట్టుకుని తిరుగుతున్నారే గాని దానిలోని సారాంశాన్ని మాత్రం గ్రహించ లేకున్నారు. మనుషులు కల్పించిన అనేక పద్ధతులను దైవోపదేశములుగా బోధించి దేవునిని వ్యర్థంగా ఆరాధిస్తున్నారన్న బైబిలు మాటను తమ బ్రతుకుల్లో కన్పరుచుటకు ఉత్సుకత చూపేవారే ఎక్కువైపోవుట అత్యంత బాధాకరం. దేవుని వాక్యాన్ని మాత్రం ఉన్నది ఉన్నట్టుగా చెప్పేవారు కరువైపోతున్నారు. ఇది ఎంతో విచారించదగ్గ విషయం. కాబట్టే అజ్ఞానాంధకారంలో మునిగి తేలుచున్న సమాజాన్ని మేల్కొల్పాలి. తర తరాలుగా పాతుకుపోయినటువంటి అసత్యపు మాటలను సమాధి చేసి అసలైన సత్యాని ప్రకటించాలి. ఇంతటి దయనీయ దుస్థితి నుండి సమాజాన్ని కాపాడే అసలైన దేవుని జ్ఞానం ఈ ప్రపంచానికి చాటి చెప్పటానికి ఉప్పెన లాంటి మార్పు రావాలి. అంటే ముందుగా దేవుడెవరో తెలియాలి. పిమ్మట మనిషి పుట్టుక, మనిషిపై దేవుని సంకల్ప ప్రణాళికలు, మరణము, మరణాంతర జీవితం తదితర సంగతులను తెలుసుకోవాల్సిన అవసరం మనిషికి ఎంతైనా ఉంది. అప్పుడే ప్రపంచ మానవాళిలో మార్పన్నది చిగురిస్తుంది. అందుకే ఈ అంధకారబంధురమైన దుస్థితిని రూపుమాపి, తిరిగి మరుగునపడిన సత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేయడానికే ఒక నూతన ఒరవడిలో దేవుడు 'క్రైస్తవనాడు'ను మనదేశాన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగులో బైబిలు తర్జుమా చేయబడిన విశాఖనగరంలో వెలిసింపచేశాడు. నిర్జీవమైన ఇప్పటి పరిస్థితుల్లో చైతన్యం పురిగొల్పడానికి ఆవిర్భవించిన సామాజిక, ఆధ్యాత్మిక పక్ష పత్రికే 'క్రైస్తవనాడు' పేపరు. యేసుక్రీస్తును శకపురుషునిగా, అభిషక్తునిగా, సత్యస్వరూపిగా, యుగాధికారిగా, సర్వోన్నతునిగా, పూజార్హునిగా ఇలా మరెన్నో నామములతో అభివర్ణిస్తున్నటువంటి అద్వితీయ పత్రికే 'క్రైస్తవనాడు'. అందును బట్టి 'దేవునికి స్తోత్రం'

క్రైస్తవనాడు పత్రికలో వై. కనకరాజు గారి కలం నుండి 'ఎడిటోరియల్, చాకిరేవు, దేవుని జ్ఞానం చెప్పునదేమనగా, దేవుని జ్ఞానం–మానవ జ్ఞానం ఇంకా ఎన్నో శీర్షికల ద్వారా విజ్ఞులకు సైతం తెలియనటువంటి దేవుని జ్ఞానాన్ని వ్రాయిస్తూ గొప్ప గొప్ప వాళ్ళకే ముచ్చెమటలు పట్టిస్తూ, వాక్యం పట్ల అనేకులు చేస్తున్న తప్పిదములను అంగీకరించి, సరిదిద్దుకునేలా చేస్తున్న 'దేవునికి స్తోత్రం'. 4 సం॥లుగా దిగ్విజయంగా నడిపింపబడి విశాఖ జిల్లాలో మొదలై రాష్ట్రాలు దాటి 5వ సంవత్సరంలో అడుగిడుతూనే నేడు వెబ్‌సైట్ ద్వారా విశ్వవ్యాపితమైన ఒకే ఒక ఆధ్యాత్మిక, సామాజిక పక్షపత్రిక క్రైస్తవనాడు పేపరు. ఇది మా కుటుంబానికిచ్చిన ఆశీర్వాదమని సగర్వంగా చెప్పుకొను గొప్ప ఘనతను, ధన్యతను బట్టి దేవునికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

**నీ కుమారుడు నిన్ను మహిమపరచునట్లు నీ కుమారుని మహిమపరచుము. ★**

పై వాక్యాన్ని మా నాన్నగారి యెడలను, మా యెడలను నిజం చేస్తూ నిరంతరం కృప చూపుతున్న 'దేవునికి స్తోత్రం'. ఈ భూమి మీద వాక్యం చేతబట్టుకుని దేవుని మాటలు చెప్పి దేవున్ని మహిమపరిస్తే, ఆయన కూడా మనల్ని మహిమ పరుస్తారు. మనకు ఈ లోకంలో మహిమ వచ్చినా, ఘనత వచ్చినా అది కేవలం ఆయన మాటలు చెప్పుట ద్వారానే అని మరువవద్దు. కాబట్టి దేవుని మాటలకు ఇకనైనా చోటివ్వండి. దేవుని మాటలను మాత్రం మన హృదయాలలో పదిలపరచుకుందాం.

క్రైస్తవనాడులో ప్రచురించబడుతున్న ప్రతీ అంశం చదివిన ప్రతీ కుటుంబానికీ ఇకముందూ కూడా ఆశీర్వాదకరంగానే ఉండాలని వ్రాయబడుచున్న అంశాలను చదివి చంచల మనస్కులు కాక సాత్వికంతో సత్యాన్ని అంగీకరించి, జీవించి దేవుని దీవెనలు పొందుకోవాలని ఆకాంక్షిస్తూ...

మన పట్ల ఎన్నో మేలులు చేస్తున్న దేవాది దేవునికి మహిమా, ఘనత, ప్రభావములు చెల్లిస్తూ...

'క్రైస్తవనాడు' పేపరు 'సంచలనం' ఆర్టికల్స్‌తోబాటు గత సంవత్సరాల నుంచి విశాఖ కేంద్రంగా వెలువడిన 'క్రైస్తవనాడు' పేపర్లలో గల 'సంచలనాత్మక' బైబిలు వివరణలున్న ఆర్టికల్స్‌ను కలుపుతూ ఓ ప్రత్యేక 'క్రైస్తవనాడు' విడుదలవబోతోంది! అతి తర్వలోనే అది విడుదలయ్యేట్లు మీ మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకోగలరని మనవి. సంచలనాత్మక వివరణలన్నీ సత్యానుకూలంగానే ఉంటూ దుర్బోధకుల నోళ్లు మూయిస్తాయి.. తిరిగి ప్రశ్నించలేని విధంగా ఆ వివరణలు ఉంటాయి. అందుకు మునుపటి 'క్రైస్తవనాడు'ల్లోని రచనలే సాక్ష్యాలు. దుర్బోధకులు ఎంతటివారైనా వారు దేవుని యెదుట అనగా వాక్యం యెదుట తమ్మును తాము తగ్గించుకొంటారన్న ఆశ కలిగిన పాఠకుల మాటలే మాకోబలం

– ప్రేమతో బ్రదర్ వై.కనకరాజు.

**లోకోక్తులు :** ❖ **పరమాత్మ గాలిపటంలా దూరంగా ఉన్నా, భక్తి అనే దారం మన చేతిలో ఉంటే గాలిపటంలా ఆయన మన స్వాధీనంలో ఉన్నట్లే.** ❖ **తలుపుతీస్తే పంజరంలో చిలుక ఎగిరిపోతుంది. తొమ్మిది తలుపులు తీసి ఉన్న శరీరంలో చిలుక ఏ క్షణంలోనైనా ఎగిరిపోవచ్చని జ్ఞానంతో మనిషి ప్రవర్తించాలి.**

6 క్రైస్తవనాడు ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక 16-30 సెప్టెంబర్ 2015



**బైబిలుపై అనేకులకున్న సందేహాలను, ప్రశ్నలను పటాపంచలుగావించే... దుర్బోధకులకు చెక్ పెట్టే....?! అనేక మర్మగర్భ వాక్య సారాంశాలు సులువుగా నేర్పే...**

## 'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా '

### దేవునికి పక్షపాతం లేదు.. అందరి హృదయాలు ఒకటే!

# హృదయంలో నిండేదేంటి?

మనలో ప్రతి తరంలోను ఒకరికొకరికి మధ్య అనేక భేదాభిప్రాయాలుండుట చూస్తున్నాం. వ్యక్తిగత జీవితాల్లో అభిప్రాయభేదాలుండుట సహజమే! కానీ... దేవుని వాక్యంలోను, సంఘాల నడుమ పద్ధతుల్లోను భేదాలుండుట విన్నవారికి చూసేవారికి అసహజంగా కన్పిస్తాయి. అందువల్ల అనేకచోట్ల దైవవాక్య వ్యతిరేక శక్తులు ప్రబలుచుండుట కూడా చూడగలం. దీనంతటికి ఒకేఒక కారణం మనలో అనేకులు లేఖనాలను దైవోద్దేశంతో హృదయాల్లో నింపుకొనకపోవుటేనన్నది నిర్వివాదాంశం. దేవుని వాక్యంలో మానవ హృదయానికెంతో ప్రాముఖ్యముంది. కాబట్టి మన హృదయం ఎలా ఉండాలి? ఎక్కడ ఉండాలి? ఏం చేయాలన్నది ఎరుగుట నేడెందరికో అత్యవసరం. అది ఎరిగిన వారందరూ దేవునిలో ఎదుగుతూ మరనేకులకు ఆదర్శంగా జీవించగలరు.

ముందుగా మన హృదయం ఎలా ఉండాలి? అన్న ప్రశ్నను గూర్చి లేఖనం ఏం చెప్పింది? దేవుడు మనల్ని నిరించేప్పుడు మన హృదయాన్ని ఎలా నిర్మించారో అలానే ఉండాలి. మనం ఎదుగుతున్న కొలది ఆ హృదయంలో దేవుని వాక్యాలే నిండాలి. తద్వారా మన బ్రతుకు పండాలి. దేవునికి పక్షపాతమేమియు లేదని లేఖనాలను బట్టి మన మెరుగుదుము. కాబట్టి పక్షపాత మేమియు లేని దేవుడు భూలోకనివాసులందరి హృదయాలను ఒకేలానే నిర్మించారని లేఖనం సాక్ష్యమిస్తుంది.

**భూలోక నివాసులందరి వైపు ఆయన చూచుచున్నాడు. ఆయన 'వారందరి' హృదయములను ఏకరీతిగా నిర్మించినవాడు. ★**

పై వాక్యాన్ని బట్టి దేవుడు మన (లోకులందరి) హృదయాలను ఏకరీతిగా చేసారని గ్రహించగలుగుతున్నాం. హృదయమనేది మనుష్యుల్లో ఒక ఖాళీ జాగా లాంటిదని గ్రహించాలి. ఆ ఖాళీ చోటులో ఏవైనా నిలుపుకోవచ్చు. అవి మంచి మాటలైనా, చెడుమాటలైనా. ఎందుకంటే మన ప్రభువైన యేసుక్రీస్తు మాటల్లో.. హృదయం 'నిండిన' దాని బట్టి నోరు మాట్లాడుతుందని కన్పడుతుంది. కాబట్టి మానవులెవరైనా తమ తమ జీవితాలను నడుపుకొనేందుకు హృదయమన్నదే మఖ్యమని గ్రహించాలి. హృదయంలో నిండింది మనిషి మస్తిష్కంలో రూపుదిద్దుకొని ఆ మనిషిని నడిపిస్తుందని బైబిలునందున్న లేఖనాలను బట్టి గ్రహిస్తున్నాం. అందువల్ల హృదయాన్ని గూర్చి 'లేఖనాలు' ఏం వెల్లడి పరుస్తున్నాయో గ్రహించాలి. వాటిని మన బ్రతుకుల్లో అన్వర్తించుకొని ప్రభువన్నట్లు లోకానికి మనమొక వెలుగులా ప్రకాశిద్దాం. తద్వారా యేసుక్రీస్తు నెరుగని వారెందరికో ఆయనను గూర్చి ప్రకటిద్దాం. తండ్రియైన దేవుని చిత్తాన్ని మన కుటుంబాల్తో సహా మహిమపరుద్దాం. ఇక హృదయాన్ని గురించి....

హృదయమన్నది ఓ ఖాళీగానున్న భాగమని పైన మనం చెప్పుకున్నాం. దాంట్లో ఏవి నింపుకుంటే అవసరానికి వాటినే మనం వాడగలం. కాబట్టి మన ప్రభువైన యేసుక్రీస్తు వారి మాటలను బట్టి మన హృదయాల్లో నింపుకొనే వాటి విషయమై జాగ్రత్త పడదాం. మన హృదయాల్లో ఏవేమి నింపితే మనమనే మాట్లాడతామని చెప్పిన యేసు పలికినదోసారి చదువుతూ ముందుకు సాగుదాం...

**హృదయమందు నిండియుండు దానినిబట్టి నోరు మాటలాడును గదా. ★**

పై వాక్య భావాన్ని బట్టి మన హృదయమనే ధననిధిలో దేవుని గూర్చిన మాటలు నింపుకోవాలి. ఎప్పట్నుంచి నింపుకోవాలి? బాలుడుగా ఉన్నప్పట్నుంచే నంటుంది బైబిలు. అవి మన నోటనుండి బయటకొచ్చేటప్పుడు మన కుటుంబీకులు, స్నేహితులేగాక వినిన వారనేకులకు ఆదరణతో బలపరుస్తాయి. తద్వారా వారూ దేవునిలో ఎదిగి లోకానికి తమవంతు సేవ తాము చేయగలరు. మరణపర్యంతము దేవుని యొద్దకు తమ ఆత్మను చేర్చుకొను భాగ్యాన్ని పొందగలరు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా చెడువిషయాలతో తమ హృదయాన్ని నింపుకొంటుంటే వారంతకంతకు చెడిపోయి తమ తరమువారికి కంటకులుగా మార్తారనుటకు ఎటువంటి సందేహమును లేదన్న బైబిలు పండితుల మాట ఎంతైనా ఆలోచించదగిందే!

రండి!

పాల్గొనండి!! ప్రార్థించండి!!!

**2015 అక్టోబర్ 2 వ, తేదీన**

## నేషనల్ డే ఆఫ్ ప్రేయర్

**ప్రసంగం : రెవ.డా.పి.యేసుపాదం**

(డైరెక్టర్ : లవ్ ఎన్ కేర్ మినిస్ట్రీస్, పి.యం.పాలెం, విశాఖపట్నం)

**వేదిక : క్రైస్ట్ చర్చ్**

గురుద్వార జంక్షన్, టిపిటి కాలని, విశాఖపట్నం, ఎ.పి.

- విశాఖ సెంట్రల్ కమిటీ

**సంచలనం!** ఆర్టికల్ !

చదవండి! అనేకులతో పంచుకోండి!! మరింత విస్తరించేట్లు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తు చేసుకోవాలని కోరుతున్నాం. - ఎడిటర్

# యవ్వనస్థులకో మేల్కొలుపు!

ప్రస్తుత దినాల్లో సేవ చేస్తున్న కొందరియొద్ద యవ్వనస్థులైన యువతీయువకులను చూస్తుంటాం. వారిలో విధ్యార్థికులూ ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో కన్పడే ఈ యవ్వనస్థులను నడిపించే వారు వీరి మీదే ఆధారపడి పబ్బం గడుపుకుంటుంటారు. యవ్వనస్థులను అమాయకుల్ని చేసి దేవుని సేవ, పరిశుద్ధాత్మ లేక యువసేన మొదలగు పేర్లతో వాడుకుంటుంటారు. వీరు చదువుకున్న వారైనా బైబిల్లో పట్టులేక ఆయా నాయకుల పంచన నిర్వీర్యంగా బ్రతికేస్తుంటారు. వీరిని చూపి వారేమో తమ ప్రాభవాన్ని పెంచుకుంటారు. వీరికో 'యూనిఫాం' ధరింపజేసి మరీ బుట్టలో పెట్టేసుకుంటారు. వీరేదో కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగుల్లా తెగఫీలయిపోతూ ఆ నాయకుల అడుగులకు మడుగులొత్తుతుంటారు. దేవుడు తమనెందుకు చదివించారు, తమనెందుకు ఏర్పరచుకున్నారు అన్న ఇంగితజ్ఞానం కూడా ఆయా సంస్థనాయకుల దగ్గరున్న యవ్వనస్థులకు లేకపోవుట కడు శోచనీయం. ఎవరైనా చెప్పినా అనేకులకు పట్టదు. ఓ రకంగా చూస్తే ఈ యవ్వనస్థులు ఆయా నాయకుల దగ్గర జీతభత్యాలు లేని ఉచిత పనివాళ్ళు. పనివీళ్లది సంపాదన, సోకులు ఆ నాయకులవి. ఇలా సాగుతున్నాయి రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లోగల కొన్ని సంస్థలు. వీరి హంగూ ఆర్భాటం చూచి అనేకులు మోసపోతున్నారు. అందువల్ల ఆయా నాయకులు మూడు ఆరాధనలు, నాల్గు ఆరాధనలు ఇలా అవసరం లేకున్నా ఆరాధనలు పెంచేస్తుంటారు. ప్రతివారం లక్షలాది రూపాయలు పోగేసుకుంటుంటారు. యవ్వనస్థులచే మాత్రం భట్రాజుపొగడ్తలు పొగిడించుకుంటూ ఏదో ఇచ్చాం అన్న చందాన తృణమో పణమో చెల్లిస్తుంటారు. అదీ కూడా వారు వీడి వెళ్లకుండా ఉండేందుకు మాత్రమే. నాయకులు మాత్రం వీరందరిని లోకానికి ఘనంగా చూపి తమపబ్బం గడుపుతూ దర్పం వెలగబెడతారు. ఇదంతా మనలో చాలా మందికి తెలిసిందే. వారి అభిప్రాయాలే ఈ ఆర్టికల్.

## యవ్వనస్తులారా మీకో ప్రశ్న!

మీరు ఇప్పుడు సేవ చేస్తున్న సేవకుల దగ్గర మీరు చేరి ఎన్నాళ్లైంది? ఆ సేవకులు 'లోకంలో' ఎంత ఎదిగారు. మీ బ్రతుకులు దేవునిలోను లోకంలోను ఎంత ఎదిగాయి? ఇప్పుడు మీ వయస్సెంత? మీరు ఇలానే ఆయా వ్యక్తుల దగ్గర సేవంటూ మరికొన్ని సంవత్సరాలు గడిపేస్తే అప్పుడు మీ వయస్సెంత అవుతుంది? ఓ సారి ఆలోచించండి! ఆ సమయంలో ఆ సేవకుడు లేక సేవకురాలు చనిపోతే? ఆ చోటికి ఇప్పుడున్నంత మంది విశ్వాసులు వస్తారా? ఆరాధనలో పాల్గొంటారా? ఇప్పుడున్నంత ఆదాయం రాబోవు రోజుల్లో మిమ్మల్ని నడిపే నాయకులకు లేకుంటే మీ పరిస్థితేంటి? అప్పటి మీ వయస్సును బట్టి ఈ సమాజంలో మీరెలా జీవిస్తారు? మీ పిల్లల భవిష్యత్తు ఎలా తయారవుతుంది? ఇవన్నీ ఎప్పుడైనా ఆలోచించారా? ప్రభువు ఇలాంటి సేవనా చేయమన్నారు? దేవుడలా ఎన్నడూ చెప్పరని గ్రహించండి. మీరు సమాజంలో మీ చదువులకు తగ్గ ఉద్యోగాలు చేయాలి. మీరు పనిచేసే సంస్థల్లోకి సువార్తికులకు అనుమతి ఉండకపోవచ్చు. అక్కడ మీరు సువార్త చేయాలి. అది దేవుని ఉద్దేశ్యం. ఆ ఉద్ధేశ్యాన్ని నెరవేర్చండి. మిమ్మల్ని చదివించిన తల్లిదండ్రుల్ని, అందుకు కారకులైన దేవున్ని గౌరవించండి. మీరు లోకంలో కష్టించి సంపాదించండి. సువార్తకు సహకరించి సవార్త విస్తరణకు మీవంతు సహకారమందించండి. అంతేగాని సేవకుల వెంట ఉంటూ మీ భవిష్యత్తును నిర్లక్ష్యం చేయకండి. ఇది ఎందరో యవ్వనస్థులైన తల్లిదండ్రుల మనోవేదన. ఇది చదువుతున్న మీరు మీ తల్లిదండ్రులూ మీ మీద అట్టి ఆశలే పెట్టుకున్నారేమో గమనించండి. మీరు దేవుని చేతిలో బాణమవ్వాలేగాని సేవంటూ ఆస్తులు పోగేసుకుంటున్న వారిదగ్గర కుర్చీలు ఎత్తాలి,మోయాలి, సర్దాలి అనుకోకు. వాటికి వేరే వాళ్లను కూలికి పెట్టుకుంటే వారికి ఉపాధి చూపినట్లుంటుంది. ఆ సమయంలోనే వారికీ సువార్త వినిపించినట్టు ఉంటుంది. దేవుడు ఎవరిని ఏ స్థితిలో నిమమించెనో వారాస్థితిలోనే ఉండాలి. దేవుడు నిన్నో సేవకునిలా చూడాలనుకుంటే తప్పక నీ యెడల తన చిత్తాన్ని నెరవేర్చుకుంటారు. నీవు ఓ కూలివానిలా సేవకుడని లోకంలో గొప్పలుపోతున్న వారిదగ్గర బ్రతకాల్సిన అవసరం లేదు. మరలా చెబుతున్నా యవ్వనస్థులారా! మీ చదువుకు తగ్గ అవకాశాలకై ప్రయత్నించండి. సఫలం చేసే దేవున్నే మనం కలిగున్నాం. సమాజంలో మీరు పనిచేసే ప్రాంతాల్లో సువార్త ప్రకటించేందుకు మీరే ఓ సాధనమవ్వాలన్నది దేవుని కోరిక. అట్టి అవకాశం అందరికి ఉండదు. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల్లోకి అందరిని అనుమతించరు. మీకో ఉద్యోగాన్ని కల్పించి సువార్త ప్రకటించే 'భాగ్యాన్ని' ఇచ్చిన, ఇస్తున్న దేవుని ప్రణాళికలో ఇది చదివిన తర్వాతైనా భాగస్థులవండి. మరింతగా ఆశీర్వ దించబడండి. మరెందరికో ఆశీర్వదంగా ఉండండి. దేవునికి మహిమ తీసుకురండి. తద్వారా మీ తల్లిదండ్రులను, కుటుండేనన్నది ఎరగండి. ఆయన అభీష్టాన్ని మీ జీవితాల్లోనూ నెరవేర్చుకుంటూ సార్ధకనామధేయులవండి. మీమీదున్న మక్కువతో.... **– బ్రదర్ వైకెయార్**

# చావైతే మేలు! అంటే...

**నమ్మాలి మీరు..!**

యేసు శిష్యులు ఎందర్నో బ్రతికించిన వారే అయినా సరే వారు మరణించేటప్పుడు మరిన్ని సంవత్సరాలు బ్రతకాలని ఆశించలేదు... ప్రార్థించనూలేదన్నది బైబిల్ సాక్ష్యం. చావైతే లాభం అని వారు అనుకున్నారు. కాబట్టే దేవుడు వారినలాగే ఆశీర్వదించారు. వారి చావు మనకెంతో లాభాన్ని చేకూర్చింది. వారు చనిపోయినా, దేవునికొరకు చేసినవి వ్రాసినవి మనకెంతో మేలు చేస్తున్నాయి. తరతరాలకు అవి మేలునే కల్గిస్తాయి. వారి చావుతో దేవుని చెంతకు వెళ్తామన్న భరోసాను వారు కలిగి ఉన్నారు. అందుకే వారికి చావు లాభంగా కన్పడింది. వారిచే జరిగించబడిన దేవుని సేవకు మాత్రం చావు లేదు. ఆ సేవ దేవుని నమ్మిన వారందరికి మేలు చేయాలన్నదే వారి కోరిక. ఆహా! ఎంత గొప్ప కోరిక వారు కల్గి దేవుని సేవ చేసారో కదా! అందుకే వారి పేర్లను పలుకకుండా బైబిలు ద్వారా తండ్రియైన దేవునిని, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుని ఎవరూ ప్రకటించలేరు. ఇంతకన్నా వారికి ఆశీర్వాదమేముంటుంది? ఆలోచించాలి!

**ఆచరించాలి మరి..!**

7 క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక
16-30 సెప్టెంబర్ 2015

# ప్రేమ రాహిత్యము



- డా.జాయ్ చెరియన్
'యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్',
రాం నగర్,
(హైద్రాబాద్)

పరిశుద్ధ గ్రంథములోని ఉపదేశ సారమంతయు ఒక్క మాటలో చెప్పాలంటే అది ప్రేమయే. ప్రేమకు నిర్వచనము దేవుడే. దేవుడు ప్రేమాస్వరూపి. ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు.

**"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను."**

**- యోహాను 3:16**

సిలువలో చాపబడిన ప్రభువు హస్తాలు గమనిస్తే ఆయన ప్రేమ వ్యక్తమవుతుంది. మనలను ఎంతగా ప్రేమించాడంటే మన రక్షణ కొరకు తన ప్రాణము నర్పించాడు. ప్రేమ మరణమంత బలమైనది. సిలువలోని నిలువు కర్ర పరమందున్న తండ్రియైన దేవునికి భూమి మీదున్న నీకున్న బంధమును; అడ్డుకర్ర నీకును తోటి విశ్వాసికిని మధ్య బంధమును సూచిస్తుంది.

**"మనము దేవుని ప్రేమంచితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది."** **- 1యోహాను 4:10**

మనము యేసు ప్రభువు బిడ్డలముగా తోటి విశ్వాసులను ప్రేమించాలి. కుటుంబములోని ప్రతి వ్యక్తిని ప్రేమించాలి. నీ ఇరుగు పొరుగు వారిని ప్రేమించి వారికి ప్రభువు ప్రేమను తెలియజేయాలి. రక్షణ సువార్త అందించాలి. ప్రభువు మనల్ని ప్రేమించినట్లే మనము ఒకరినొకరు ప్రేమించాలి. నీలో ఉన్న ప్రేమనుబట్టి నీ భక్తి జీవితము తెలిసిపోతుంది. నీలో ప్రేమ లేకుంటే నీ భక్తి నిష్ ప్రయోజనము. అందుకే పరిశుద్ధాత్మద్వారా మా హృరయము ప్రేమతో నింపుమని ప్రార్థించాలి.

**"ప్రియులారా, మనము ఒకనినొకడు ప్రేమింతము: ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది; ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగను. దేవుడు ప్రేమాస్వరూపి, ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు."** **- 1యోహాను 4:7,8**

పరిశుద్ధ గ్రంథములో ఒక అధ్యాయమంతా ప్రేమను గూర్చి వివరించబడింది. అపొ.పౌలు కొరింథీ సంఘమునకు లేఖ వ్రాస్తూ - మీరు ప్రేమ కలిగి యుండుటకు ప్రయాసపడాలి అంటూ ప్రేమను గూర్చి వివరిస్తాడు.

**"మనుష్యుల భాషలతోను దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేని వాడనైతే మ్రోగెడు కంచును గణగణలాడు తాళమునై యుందును. ప్రవచించు కృపావరము కలిగి మర్మములన్నియు జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను, కొండలను పెకిలింపగల పరిపూర్ణ విశ్వాసముగలవాడనైనను, ప్రేమలేనివాడనైతే నేను వ్యర్థుడను. బీదలపోషణకొరకు నా ఆస్తి అంతయు ఇచ్చినను, కాల్చబడుటకు నా శరీరమును అప్పగించినను, ప్రేమ లేని వాడనైతే నాకు ప్రయోజనమేమియు లేదు. ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు; స్వప్రయోజనమును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు. దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును. ప్రేమ శాశ్వతకాలముండును. ప్రవచనములైనను నిరర్థకములగును; భాషలైనను నిలిచిపోవును; జ్ఞానమైనను నిరర్థకమగును; కాగా విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును; వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే."**

**- 1 కొరింథీ 13:1 నుండి 8,13**

పూర్వము హింసకుడను, దూషకుడను, హానికరుడనైన నన్ను తన పరిచర్యకు నియమించి, నమ్మకమైన వానిగా దేవుడు ఎన్నుకొన్నాడంటే అది ప్రభువు యొక్క ప్రేమయే. సంఘమును హించించిన నన్ను సంఘము స్థాపించడానికి వాడుకున్నాడంటే కేవలము ప్రభువు యొక్క ఉచితమైన కృప, యేసుక్రీస్తు సిలువ ప్రేమయే అని అపొ. పౌలు భక్తుడు తనను గూర్చి సాక్ష్యమిస్తున్నాడు.

ఎవడైనను క్రీస్తు యేసునందున్న యెడల వాడు నూతన సృష్టి. యేసు ప్రభువును రక్షకుడిగా అంగీకరించిన నీవు ప్రేమతో నింపబడాలి. నీవు చేసే ప్రతి కార్యములో ప్రేమ యిమిడి యుండాలి.

**"మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడియున్నది."** **- రోమా 5:5**

కొందరు మేము కృపావరముల చేత నింపబడ్డాము అంటారు గాని వారితో ప్రేమ కొంచెమైనా కనబడదు. ఏవో నాలుగు భాషలు మాట్లాడి పరిశుద్ధాత్మతో నింపబడ్డామని భావిస్తారు. వేల కొలది భాషలు మాట్లాడినా నీలో ప్రేమ లేకుంటే వ్యర్థము. ప్రేమ లేకుండ పేరు ప్రఖ్యాతుల కొరకు కొందరు దానధర్మాలు చేస్తారు గాని అట్టివాటి వలన ప్రయోజనముండదు. నీవు చేసే ప్రతి పని దేవుని ప్రేమ, కనికరముతో నిండియుండాలి. నీలో ప్రేమ లేకుంటే పరిశుద్ధాత్మద్వారా నీలో ప్రేమ కుమ్మరింపబడాలని ప్రార్థించాలి. జ్ఞానము, ప్రవచనము, భాషలు నిరర్థకములవుతాయి గాని ప్రేమ శాశ్వత కాలముంటుందని పౌలు భక్తుడంటున్నాడు. ప్రేమ లేకుంటే కుటుంబములలో కలహాలు, మనస్పర్థలు వస్తాయి. సంఘములు చీలిపోతాయి. దేవుని ప్రేమ నీలో ఉంటే నిన్ను నీవు తగ్గించుకొని, ఇతరులను క్షమిస్తూ, సహిస్తూ ఉంటే కుటుంబములలో సంఘములలో శాంతి నెలకొంటుంది.

**"ఉపదేశసారమేదనగా, పవిత్ర హృదయము నుండియు మంచి మనస్సాక్షినుండియు నిష్కపటమైన విశ్వాసమునుండియు కలుగు ప్రేమయే."**

**- 1 తిమోతి 1:5**

కాని ఈ అంత్య దినములలో అనేకులలో ప్రేమ చల్లారిపోతుంది. కుటుంబములలో సంఘములలో ప్రేమ కరవయింది. తోటి విశ్వాసులలో ప్రేమలేదు. పైకి 'ప్రేయిజ్ ద లార్డ్' అంటారు గాని హృదయములో ప్రేమ ఉండదు. వార్తా పత్రికలు, టి.వి.లలో చూస్తే ప్రేమ పేరుతో యౌవనస్థులు ఉన్మాదులుగా మారి తాము ప్రేమించామన్న వారినే గాయపరుస్తు హత్య చేసి నేరస్థులవుతున్నారు. కలుషితమైన ప్రేమ, స్వార్థముతో నిండిన ప్రేమ అది నిజమైన ప్రేమ కాదు.

**"అంత్యదినములలో అపాయకరమైన కాలములు వచ్చునని తెలిసికొనుము. ఏలాగనగా మనుష్యులు స్వార్థప్రియులు ధనాపేక్షులు బింకములాడువారు అహంకారులు దూషకులు తలిదండ్రులకు అవిధేయులు కృతజ్ఞతలేనివారు అపవిత్రులు అనురాగ రహితులు అతిద్వేషులు అపవాదకులు అజితేంద్రియులు క్రూరులు సజ్జనద్వేషులు ద్రోహులు మూర్ఖులు గర్వాంధులు దేవునికంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు, పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించనివారునై యుందురు. ఇట్టివారికి విముఖుడవై యుండుము."** **- 2 తిమోతి 3:1 నుండి 5**

**"అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును."** **- మత్తయి 24:12**

ప్రేమించామని చెప్పి ప్రాణము తీస్తున్నారు గాని మన ప్రభువు మనలను ప్రేమించి తానే మన కొరకు మరణించాడు. ఎందుకంటె మనము రక్షింపబడి నిత్యజీవమునకు వారసులం కావాలని. ఆయన ప్రేమలో ఏ స్వార్థము లేదు. చివరి రక్తపు బొట్టు వరకు మన కొరకు చిందించాడు. పవిత్రమైన ప్రేమ కలిగి యుండాలి. అంత్య దినములు, అపాయకరమైన రోజులలో ఉన్నాము. బయటకు వెళ్తే తిరిగి క్షేమముగా ఇల్లు చేరుతామనే నమ్మకము లేదు. స్వార్థప్రియులు, ధనాపేక్ష గలవారు ఎక్కువై పోయారు. దేవుని సేవ అంటారు గాని నశించిపోయే ఆత్మల మీదున్న భారము కన్నా ధనము మీదే వారి దృష్టి నిలుపుతారు. క్రూరత్వము పెరిగిపోయింఇ. అనురాగరహితులుగా మారి నేరములకు పాల్పడుతున్నారు. కుమారుడు తండ్రిని, భర్త భార్యను చంపుకుంటున్నారు. చాలా మంది దేవుని కంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమిస్తున్నారు. అక్రమము విస్తరించిపోతుంది. వీటన్నిటికి ప్రేమ రాహిత్యమే కారణము అందుకే దేవుని ప్రేమను లోకమునకు చాటించాలి. దేవుని ప్రేమతో నింపబడాలి. ధర్మశాస్త్రములోని ఆజ్ఞలలో ముఖ్యమైనవి దేవుని ప్రేమించాలి, నిన్ను వలె నీ పొరుగువారిని ప్రేమించాలి.

**"నీవు నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణవివేకముతోను నీ పూర్ణబలముతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమించవలెననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది, నీవు నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననునది."** **-మార్కు 12:30,31**

**"ఒకడు తన్ను వలె తన పొరుగువాని ప్రేమించుటయు సర్వాంగ హోమములన్నిటి కంటెను బలులకంటెను అధికమని ఆయనతో చెప్పెను."**

**- మార్కు 12:33**

**"మీరు ఒకరి నొకరు ప్రేమింపవెలనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను; నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరి నొకరు ప్రేమింపవలెను."**

**- యోహాను 13:34**

నీ పొరుగువారిని ప్రేమించడము బలుల కంటే సర్వాంగ హోమముల కంటే శ్రేష్ఠమని ప్రభువు సెలవిస్తున్నాడు. నేను మిమ్మును ప్రేమించినట్లే మీరును ఒకరినొకరు ప్రేమించుకోవాలనే ఆజ్ఞ యిస్తున్నాడు. క్రీస్తుయేసుకు కలిగిన మనస్సు కలిగియున్నప్పుడే ఇతరులను ప్రేమించగలవు. నీ ద్వారా ఇతరులు ప్రేమ, ఆదరణ పొందాలి. నీలో దేవుని ప్రేమ చూడాలి. ఎల్లప్పుడు విశ్వాసిగా ప్రేమ కలిగి యుండుటకు ప్రయాసపడాలి. వారి కొరకు ప్రార్థించాలి. ప్రభువు సిలువలో వ్రేలాడుతు తనను హింసించే వారికొరకు ప్రార్థించాడు. తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని ప్రార్థించాడు.

**"మీరు మిమ్మును ప్రేమించువారినే ప్రేమించినయెడల మీకేమి ఫలము కలుగును? సుంకరులును ఆలాగు చేయుచున్నారు గదా."**

**-మత్తయి 5:46**

మిమ్మును ప్రేమించే వారినే ప్రేమిస్తే లాభమేమి? నిన్ను ద్వేషించే వారిని ప్రేమించడమే పరిశుద్ధాత్మశక్తి. నీవు కోపము, పగ, వ్యసనమును హృదయములో పెట్టుకుంటే అవి నీ దేహమును పాడుచేస్తాయి గనుక పవిత్రమైన దేవుని ప్రేమతో నింపబడాలి. అందరిని క్షమించాలి. అందరిని ప్రేమించాలి. మన పరలోకపు తండ్రి పరిపూర్ణుడు. మనము కూడా పరిపూర్ణులుగా ఎదగాలి.

**"మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా ప్రేమయందు వేరుపారి స్థిరపడి..."** **-ఎఫెసీ 3:18**

**"నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్థన చేయుడి. ఆయన చెడ్డవారిమీదను మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి, నీతియంతుమీదను, అనీతిమంతు మీదను వర్షము కురిపించుచున్నాడు."** **-మత్తయి 5:44,45**

ప్రేమించాలని చెప్పి తెలివిలేకుండా ఎవరిని బడితే వారిని ప్రేమించి మోసపోకండి. నీవు ప్రేమించడము దైవజ్ఞానముతో కూడి యుండాలి. ప్రతి అడుగు వివక్షణతో వేయాలి. వివేచన వరము పొందాలి. సేవకులందరూ మంచివారని నమ్మి మోసపోయిన వారనేకులున్నారు.

తెల్లవస్త్రాలు వేసుకున్న వ్యక్తిని సేవకుడని నమ్మి ఇంట్లో ఆశ్రయమిస్తే అతడు వారి కుమార్తె మీద దాడి చేశాడు. అప్పుడు అతడు సేవకుడు కాదు రాక్షసుడని గ్రహించి ఇంట్లో నుండి తరిమివేశారట. మరియెక స్త్రీ భర్త చనిపోయాడు, భర్త రిటైర్మెంట్ బెనిఫిట్ రాగానే డబ్బంతా బ్యాంక్‌లో పెట్టుకుంది. ఒక సేవకుడు ఆమె దగ్గరకు వచ్చి మందిరము కడతాను, ఆర్థిక సహాయం చేయమంటే ఆ పిచ్చి తల్లి అతనిని నమ్మి ఖాళీ చెక్ మీద సంతకము పెట్టిందట. అతడు ఆమె అకౌంట్‌లో ఉన్న డబ్బంతా డ్రా చేసేసుకున్నాడు. ఎంత మోసముతో నిండిన లోకము! అందుకే మూర్ఖులైన వక్రజనము మధ్య జీవవాక్యము పట్టుకొని జ్యోతులవలె ప్రకాశించాలి. తెలివిలేని సుద్ధమొద్దులుగా ఉండకుండ ప్రతిది వివేచించి గ్రహించడము నేర్చుకోవాలి. అందుకే అపొ.పౌలు ఫిలిప్పీ సంఘమునకు వ్రాస్తూ - **"మీ ప్రేమ తెలివితోను, సకలవిధములైన అనుభవజ్ఞానముతోను కూడినదై అంతకంతకు అభివృద్ధిపొందవలెను."** **- ఫిలిప్పీ 1:11**

దేవుడు అంటే ప్రేమకు నిర్వచనము. నీవు దేవుని ప్రేమిస్తున్నానని నీ తోటి సహోదరులను ప్రేమించకుంటే నీలో దేవుని ప్రేమ ఎక్కడుంది? దేవుని ప్రేమించేవారు తోటి సహోదరులను కూడా ప్రేమించాలి. ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు. దేవుని సేమించేవారి హృదయము అణువు అణువున ప్రేమతో నిండియుండాలి.

**"ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము. ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయనవలన పొందియున్నాము."** **- 1 యోహాను 4:19**

**"మనము సహోదరులను ప్రేమించుచున్నాము గనుక మరణములోనుండి జీవములోనికి దాటియున్నామని యెరుగుదుము. తన సహోదరుని ద్వేషించువాడు నరహంతకుడు; ఏ నరహంతకునియందును నిత్యజీవముండదని మీరెరుగుదురు."** **- 1యోహాను 3:14,15**

నీ తోటి సహోదరుని మీద ప్రేమ లేకుంటే అది హత్యతో సమానము. నీలో దేవుని ప్రేమ ఉంటే జీవములోనికి, ప్రేమ లేకుంటే మరణమందు నిలిచియుంటావు. పరిశుద్ధ గ్రంథములో చూస్తే హేబెలు, కయీను అన్నదమ్ములు. వారిలో ప్రేమ కరవైనందున అసూయ చోటు చేసుకొని కయీను హేబెలును హత్య చేస్తాడు. నీలో దేవుని ప్రేమ లేకుంటే పాపము చేయడానికి సిద్ధపడతావు. గనుక నిత్యము దేవా, నీ ప్రేమతో నన్ను నింపుమని ప్రార్థించాలి. పరిపూర్ణతకు అనుబంధమైన ప్రేమను ధరించుకోవాలి. (కొలస్సీ 3:14)

పగ కలహమునను రేపుతుంది. ప్రేమ దోషములన్నిటిని కప్పుతుంది. కాబట్టి

**"సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ సకలమైన దుష్టత్వము, మీరు విసర్జించుడి."**

**- ఎఫెసీ 4:31**

ఇవన్నీ నీ హృదయములో ఉంటే నీ శరీరమును నీ ఆత్మీయ జీవితమును భ్రష్టుపట్టించి నిన్ను దేవునికి దూరము చేస్తాయి. కనుక వీటిని విసర్జించి నీ హృదయం ప్రేమతో నింపుకోవాలి. ప్రేమ శాశ్వతకాలము నిలుస్తుంది. అన్నిటిలో శ్రేష్టమైనది ప్రేమే గనుక ప్రేమ కలిగి యుండుటకు ప్రయాసపడాలి. పరిశుద్ధాత్మద్వారా మీ హృదయములలో ప్రేమ కుమ్మరింపబడి దేవుడు మనలను ప్రేమించినట్లు మనము ఒకరి నొకరు ప్రేమింపబద్ధులమై యున్నాము.



**ప్రొఫెసర్ పి.శామ్ కుమార్**
డైరెక్టర్ ఏ.పి.బైబిల్ థియోలాజికల్ యూనివర్సిటీ,
గాజువాక, విశాఖపట్నం, ఏ.పి.

స్వచ్ఛమైన వాక్యం వినాలని ఉందా.. అయితే ప్రతిరోజు శుభవార్త టి.వి.లో

**వాక్యాన్వేషణ**

కార్యక్రమాన్ని చూడండి!

నిరీక్షణ టి.వి.లో ప్రతిరోజు మధ్యాహ్నం 1:30 ని॥ లకు

వివరములకు : 9 666 444 222


**గమనిక :** సెప్టెంబర్ నెలలో జరిగిన కార్యక్రమాల వివరాలు మరియు 10వ, సంవత్సరంలో ప్రవేశించిన సందర్భంలో 'క్రైస్తవనాడు'ను దీవిస్తూ, అభినందిస్తూ ఇచ్చిన శుభాకాంక్షలు అక్టోబర్ 1-15 'క్రైస్తవనాడు' పేపర్లో పాఠకులు చదువగలరు.

**బైబిలు ఎరుగుట, మరింత ఎరిగేందుకు ప్రశ్నించుటవల్లే లభిస్తుంది 'నిత్యజీవము'**

# దేవుడు పక్షపాతా?!

❑ పక్షపాతం చూపేవాడు దేవుడు ఎలా అవగలడు?

❑ రోమా 9:12,13,లలో యాకోబును ప్రేమించితిని, 'ఏశావు'ను ద్వేషించితిని అని వారు పుట్టకముందే దేవుడు అన్నట్లు వ్రాయబడింది. అలా ఎందుకన్నారు దేవుడు?

ఇలాంటివెన్నో ప్రశ్నలు బైబిలుపై అనేకులు అడుగుతుంటారు? అట్టి వారిని చూస్తే నాకెంతో సంతోషం కలుగుతుంది. అది వారి అపనమ్మిక అని కొందరు 'బుద్ధిహీనులు' అట్టి వారిని గురించి మాట్లాడతారు. అట్లనరాదు. వారు దేవుని మరింత ఎరిగేందుకు ప్రశ్నిస్తున్నారు. జవాబు దొరికితే దేవునిలో అనగా వాక్యంలో ఎదుగుతుంటారు. అట్టివారికే మేలు కలుగుటకై అన్నీ సమకూడి జరుగుతాయన్నది రోమా పత్రిక8:28 ద్వారా దేవుడు మనకిస్తున్న భరోసా. అందుకే నాకట్టి వారిని చూస్తుంటే మహానందం కలుగుతుంది. అందుక్కారణం.... పదేళ్ల క్రితం నేనూ అట్టివాడినే. ప్రశ్నలు.. వాటికి జవాబులు తెల్సుకొనేందుకు నాకు సమయాసందర్భాలుండేవిగావు. చేతిలోనున్న ఆ కొంచెం డబ్బుకూడా ఖర్చైపోతున్నాదన్న ఆలోచనే ఉండేదికాదు. ఆ ఆసక్తే నేడు 'క్రైస్తవనాడు' పేపరు ద్వారా నన్నిలా మీ ముందుకు తెచ్చింది. అందుకు 'దేవునికి స్తోత్రము'. 'నిత్యజీవం' 'పరలోకం' అడిగితే దేవుడు ఇవ్వరు! అందుకు తండ్రైన దేవుని, కుమారుడైన 'యేసుక్రీస్తు'ని ఎరుగుట తప్పనిసరని చేసింది బైబిలు. నమ్మట్లేదా? 'నర'లోకాన మనం ఘనులమై 'పర'లోకానికి చేరేందుకు దేవుడేర్పరచిన సులువైన కాడి ఇదే....

**అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును 'ఎరుగుటయే' నిత్యజీవము. ★**

ప్రశ్నించుట నామోషిగా భావించకండి. అలా భావించేవారు ఈ లోకాన 'ఏలాగోలా' బ్రతికేద్దామన్న ఆలోచనగలవారే నంటున్నారు బైబిల్లో పట్టున్నవారు. మనం 'ఎలాగోలా' బ్రతికేందుకు క్రైస్తవులంగా మారలేదన్నది గుర్తుంచుకోండి. ఆస్తులు లోకంలో మీతో ఎందరికో ఉన్నాయి. కానీ యేసుక్రీస్తు? తండ్రిచే ఆకర్షింపబడి యేసుక్రీస్తు నొద్దకు వచ్చామన్నది మరవకండి. అట్టి ఘనతను దేవునికే ఆపాదించండి. అతనివల్ల, ఆమెవల్ల క్రైస్తవులుగా మారామని ఆ ఘనతను వేరెవ్వరికీ ఇచ్చేట్లు మీ మాటలు, చేతలు ఉండకుండేట్లు జాగ్రత్త పడండి.

ఎదగడానికి రెండే మెట్లు.. 'ప్రశ్నించడం, జవాబు తెలుసుకోవడం' అని మహా టివి చూపుతుంది. అది 'క్రైస్తవనాడు'లోనూ ఇచ్చాం. లోకానికి అర్థమైంది ప్రశ్నించి జవాబులెరగాలని. తద్వారా 'లోకంలో' ఎదుగుతామని. మరి పరలోకస్తులమని చెప్పుకుంటున్న మనలో అనేకులు ప్రశ్నించుటకు, జవాబులు ఎరిగేందుకు ఎందుకు నామోషిగా ఫీలవుతున్నారు?

దేవుని ఎరిగేందుకు ప్రశ్నించుటకు సిగ్గుపడువారు సువార్త ఏం ప్రకటించగలరు? సువార్త ప్రకటించే 'పని' నాది కాదు అనుకోండి. ఆ 'పని' క్రైస్తవులైన ప్రతి వారూ చేయాల్సిందేనని యేసు ఆజ్ఞగా చెప్పారు. వాక్యమును ఎరగండి... ఆ వాక్యమే మనల్ని ఈ లోకాన ఎలాగోలా బ్రతుక నియ్యదు. ఘనుల్ని చేస్తుంది. తద్వారా మహిమ పరుస్తుంది.

ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!

## ముత్యాల సరాలు — మత సిద్ధాంతాలు

అన్ని దేశాలలో, అన్ని సమాజాలలో మతపరమైన కొన్ని నియమాలు ఉంటాయి. కొందరు ఆ నియమాలను ఆధారం చేసుకొని మనుష్యుల నడవడికను నియంత్రించాలని ప్రయత్నిస్తారు. తమకు నచ్చనివాడైతే చాలు మత నియమాలు అడ్డుపెట్టుకుని వాడిని నేరస్తుడిగా నిరూపించాలని చూస్తారు. ఫలానా నియమాన్ని పాటించలేదు గనుక వాడు దేవుడికి వ్యతిరేకి అని ప్రచారం చేస్తారు. కొన్ని నియమాలకు అర్థం పర్థంలేని అపార్థాలను పనిగట్టుకుని కల్పిస్తారు కొందరు.

అలాంటిదే ఒకటి యేసుక్రీస్తు జీవించి ఉండగా జరిగింది. శనివారం ఏ పనులూ చేయకూడదు. అని ఒక యూదా మత సిద్ధాంతం వుంది. ఒక శనివారం రోజు యేసు సమాజమందిరంలో బోధిస్తున్నాడు. అక్కడ కుడిచేయి పడిపోయిన వాడొకడున్నాడు. పరిసయ్యులు, శాస్త్రులు అనే మత ప్రవిష్టులు కూడా అక్కడున్నారు. వాళ్ళు శనివారం రోజున ఆయన ఆ చేయి పడిపోయిన వానిని నయం చేస్తాడేమోనని ఆయన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉన్నారు. యేసుకు వాళ్లేమి ఆలోచిస్తున్నారో తెలిసిపోయింది. ఆయన ఆ చేయి పడిపోయిన వానితో లేచి అందరి ముందు నిలుచో అన్నాడు. ఈ చేయి పడిపోయిన వాడు నిలుచున్నాడు. ఆ తదుపరి యేసు సభనుద్దేశించి విశ్రాంతి రోజు ఏమి చెయ్యటం న్యాయమని మిమ్మల్ని అడుగుతున్నాను? ఒకరికి మేలు చేయటమా? లేక కీడు చేయటమా? ప్రాణాన్ని రక్షించుటమా? లేక నాశనం చేయటమా? అని అన్నాడు. యేసు వాళ్లవైపు ఒకసారి చూసి, ఆ చేయి పడిపోయిన వాడితో 'నీ చేయి చాపు' అని అన్నాడు. ఆ చేయి పడిపోయినవాడు యేసు చెప్పినట్లు చేసాడు. అతని చేయి పూర్తిగా నయమైపోయింది. ఇది చూసి మత ప్రవిష్టులకు చాలా కోపం వచ్చింది. శనివారం పనిచేయకూడదన్న నియమాన్ని తుంగలో తొక్కుతున్నాడు గనుక యేసును చంపాలని ఆలోచించడం మొదలుపెట్టారు.

యేసు చేసింది మేలా? కీడా? అని పాఠకులు ఊహించుకోవచ్చు. అలా ఎందరికో ఎన్నో మేళ్లు చేసిన క్రీస్తును గురించి తెలుసుకోవాలంటే మా దగ్గర క్రొత్త నింబంధన అనే పుస్తకం ఉంది.

**నిరీక్షణ**

*ఇదీ అడ్రసు*
*పోస్ట్‌బాక్స్ నెం.608,సీతమ్మధార,*
*విశాఖపట్నం-13.*

ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!


క్రైస్తవులకు, సీనియర్ సిటిజన్స్‌కు రుణములపై ప్రత్యేక రాయితీ!

**అమృత వర్షిణి మ్యాక్స్ లిమిటెడ్**

**సేవింగ్స్ & క్రెడిట్ సొసైటీ**

మరిన్ని వివరములకు సంప్రదించండి.
ఫోన్ : 0891-6002999



డైరెక్టర్
సిహెచ్. ప్రభాకర్

**అమృతవర్షిణి**

మ్యూచువల్లి ఎయిడెడ్ కో - ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

రిజిష్టర్డ్ నెం. AMC/VSP/DCO 2012/3008 ఫోన్ : 0891-6002999

☛ మెంబర్లుగా చేర్చుకోబడును.
☛ డిపాజిట్లు స్వీకరించబడును.
☛ డిపాజిట్లపై నెలసరి ఆదాయం/
☛ పెన్షన్ పొందవచ్చును.
☛ డిపాజిట్లపై, భూములపై, బంగారు ఆభరణములపై రుణాలు ఇవ్వబడును.

| కాలం | వడ్డీ (%) |
|---|---|
| 12 నెలలు | 12 % |
| 24 నెలలు | 13 % |
| 36 నెలలు | 13.5 % |
| 48 నెలలు | 14 % |
| 60 నెలలు | 15 % |

సంప్రదించండి : ఆఫీస్ : ఫ్లాట్ నెం. 401, బొచ్చా స్క్వేర్. 5వ, అంతస్తు, బిర్లా జంక్షన్, మురళీనగర్, విశాఖపట్నం. ఫోన్ : 0891-6002999




Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 13 - 410 / 1 / 2, Ambedkar Nagar, Arilova, Old dairy farm (Po), Visakhapatnam - 530 040, Andhra Pradesh State, INDIA. Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at JC Printers, Ambedkar Nagar, Arilova, Visakhapatnam - 40.